దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747

# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176
epaper : https://varthaprabha.com
సమగ్ర వార్తా దినపత్రిక
విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ

SINCE: 1984
చైతన్య కాలేజ్
Cell: 93908 22625
ONE SITTING (For Discontinued)
B.Tech, M.Tech, Diploma
M.B.A, M.C.A, M.Sc, M.A.
B.A, B.Com, B.Sc, B.B.A,
U.G.C. Recog. Universities
10th & Inter TOSS / APOSS / NIOS
డైరెక్టర్: బి.వి. త్రినాథ్ M.A, M.Ed, M.Phil, L.L.B

| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 99 | ది. 18-7-2026 | శనివారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 99 | Date : 18-7-2026 | Saturday | Pages : 8 | Rs.1/- |

# రాష్ట్రాభివృద్ధిలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలి

- రుణ వితరణ కార్యక్రమంతో వ్యాపారవేత్తలుగా సామాన్యులు
- సంక్షోభంలో ఉన్న రాష్ట్రానికి నిర్మలాసీతారామన్ సహకారం
- కూటమి వచ్చాక రుణాల రీ- షెడ్యూల్‌తో రూ.1538 కోట్లు ఆదా
- నరసరావుపేట రుణ వితరణ మేళాలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- వివిధ వర్గాలకు రూ.3,216 కోట్లు పంపిణీ చేసిన సీఎం, కేంద్ర మంత్రి






**నరసరావుపేట,జూలై 17 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ప్రజల వద్దకే వెళ్లి రుణాలు అందించటం గర్వకారణమని, బ్యాంకులు రుణాలిచ్చే సంస్థలే కాదని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములన్నారు. రైతు భవిష్యత్తు మార్చడానికి, యువత కలలు నెరవేర్చడానికి, పారిశ్రామికవేత్తల లక్ష్యం నెరవేరడానికి రుణాలు ఎంతో ఉపయోగపడతాయని వ్యాఖ్యానించారు. గత వైసీపీ పాలనంతా సమస్యల సుడిగుండమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి రాష్ట్రానికి తిప్పలు తెచ్చిందని, కూటమి అధికారంలోకి వచ్చాకే ఆ రుణాల్ని కేంద్ర సహకారంతో రీ -షెడ్యూలు చేసి రూ.1,538 కోట్లు ఆదా చేశామని అన్నారు. పలనాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక శాఖ, ప్రభుత్వ రంగ బ్యాంకులు సంయుక్తంగా నిర్వహించిన మెగా రుణమేళా కార్యక్రమానికి (క్రెడిట్ అవుట్ రీచ్) కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. పలనాడు జిల్లాలో 1,03,246 మంది లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల రుణాలను అందజేశారు. ఇందులో భాగంగా 15 వేల మంది డ్వాక్రా మహిళలకు,13,355 మంది పారిశ్రామికవేత్తలకు రుణాలు పంపిణీ చేశారు.



అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ "పారిశ్రామికవేత్తలుగా మారడానికి పల్నాడు చిరునామా కావాలి. పలనాడు పౌరుషానికి శక్తివంతమైన ఆయుధం ఇస్తున్నాం. క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమం నిర్వహిస్తున్న అందరికీ అభినందనలు. రైతులు, విద్యార్థులు, డ్వాక్రా సంఘాల మహిళలు ఇలా అర్హులైన వారందరికీ రుణం అందించటమే లక్ష్యం. మహిళా సాధికారతకు ఈ క్రెడిట్ అవుట్ రీచ్ ద్వారా ప్రయోజనాలు చేకూరతాయి. రెండేళ్ల క్రితం రాష్ట్రం అంతా సమస్యల సుడిగుండంలో ఉంది. ఏపీలో ఆర్థిక విధ్వంసం చేశారు. కేంద్ర సహకారంతో అమరావతి, పోలవరం, విశాఖ ఉక్కు ఆకాంక్షలు నెరవేరాయి. వీబీజీ రామ్ జీ కింద కేంద్రం నుంచి రూ.7,707 కోట్లు రాష్ట్రానికి వస్తుంది. రాయలసీమను హార్టీ కల్చర్ హబ్ గా మార్చేందుకు కేంద్రం రూ.40 వేల కోట్లు ఆర్థిక సహకారం అందిస్తుంది.ప్రైవేటు పెట్టుబడులతో కలిపి ఈ ప్రాంతాన్ని ఉద్యాన హబ్ గా మారుస్తాం." అని సీఎం వివరించారు.

**నిర్మలా సీతా రామన్ సంస్కరణల వాది..** "మహిళలందరికీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదర్శంగా నిలుస్తున్నారు. 10 లక్షల డ్వాక్రా సంఘాలు రూ.29 వేల కోట్ల పొదుపుతో దేశంలోనే మేటిగా నిలిచాయి. రుణాల రీ పేమెంట్ లో 99.5 శాతంతో డ్వాక్రా మహిళలు అగ్రస్థానంలో ఉన్నారు. వారందరినీ మహిళా వ్యాపారవేత్తలుగా మార్చేందుకు వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమం చేపట్టాం. బ్యాంకింగ్ లో నిర్మలా సీతా రామన్ చాలా సంస్కరణలు తీసుకొచ్చారు. నష్టాల్లో ఉన్న చిన్న బ్యాంకులను విలీనం చేసి సమర్థ బ్యాంకింగ్ వ్యవస్థకు దోహదం చేశారు. డిజిటల్ బ్యాంకింగ్ విప్లవం, జన్ ధన్ యోజన ద్వారా కోట్లాది బ్యాంకు ఖాతాలు, జీఎస్టీ శ్లాబ్ లను కుదించి పారదర్శక విధానం తెచ్చారు. వికసిత్ భారత్ 2047కు అనుగుణంగా చాలా సంస్కరణలు కేంద్ర మంత్రి నిర్మల తీసుకొచ్చారు. ఈ తరహా క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమాల్ని 6 జిల్లాల్లో నిర్వహించేందుకు తక్షణమే అంగీకరించారు. త్వరలోనే 3 నెలలకు ఒకటి చొప్పున ఈ తరహా కార్యక్రమాలు చేపడతాం." అని ముఖ్యమంత్రి అన్నారు

**చిన్న వ్యాపారులకు అండగా కేంద్రం-కేంద్ర మంత్రి..** దేశంలోని ప్రతి గ్రామంలోనూ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పమని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. తాను ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టే సమయానికి బ్యాంకులు ఎన్‌పీఏల సమస్యలతో ఇబ్బందుల్లో ఉండేవని, చిన్న వ్యాపారులు అప్పులు దొరక్క నష్టపోయేవారని గుర్తుచేశారు. చిన్న వ్యాపారుల ఆర్థిక కష్టాలను గుర్తించిన ప్రధాని మోదీ.. ప్రభుత్వమే గ్యారెంటీ ఇచ్చి బ్యాంకుల ద్వారా వారికి సులభంగా రుణాలు అందేలా పథకాలు తెచ్చారని వివరించారు. నేడు బ్యాంకులు స్వయంగా వ్యాపారుల చెంతకే వచ్చి రుణాలు ఇస్తున్నాయని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. మెగా రుణమేళాలో భాగంగా లబ్దిదారులకు ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి రుణ మంజూరు పత్రాలను, చెక్కులను అందజేశారు.

**ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ అందజేత..** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.42.16 లక్షల విలువైన అంబులెన్స్‌ను పిడుగురాళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి అందించారు. అలాగే నాబార్డు సౌజన్యంతో డీసీసీబీ (DCCB) కి రూ.25 లక్షల విలువైన 2 మొబైల్ డెమో వ్యాన్లు అందించారు.

# పొగాకు రైతులను తక్షణమే ఆదుకోండి

- హార్టీకల్చర్ హబ్‌కు నిధులు ఇవ్వండి
- మేధో మథన కేంద్రంగా ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీలో సీఎం చంద్రబాబు



**అమరావతి, జూలై 17 (వార్తాప్రభ) :** రొయ్యల మేత తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలను స్థిరీకరించేందుకు కేంద్రం విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు. రొయ్యల మేతకు వినియోగించే ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరగటం ఆక్వా సాగుపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోందని ముఖ్యమంత్రి వివరించారు. ఈ కారణంగా సముద్ర ఉత్పత్తుల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతోందని స్పష్టం చేశారు. శుక్రవారం అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలను కేంద్రమంత్రి దృష్టికి సీఎం తీసుకొచ్చారు. లక్షలాది మంది రైతులు, కార్మికులు, ప్రాసెసింగ్ కేంద్రాలు, ఎగుమతి దారులు, హేచరీలు, మేత తయారీ దారులు ఇతర అనుబంధ రంగాలకు ఆక్వా పరిశ్రమ ఉపాధి కల్పిస్తోందని సీఎం వివరించారు. మేత లభ్యతలో చిన్న అంతరాయం కూడా ఆక్వా రైతుల మనుగడ, ఎగుమతులపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతోందని తెలిపారు. రొయ్య మేత తయారీదారుల సంఘం చేసిన విజ్ఞప్తి మేరకు ఈ ఏడాది జనవరి- ఏప్రిల్ మధ్య కాలంలో రొయ్య మేత ధరలు భారీగా పెరిగాయని ఫలితంగా ఉత్పత్తి వ్యయం 20 శాతం కంటే ఎక్కువగా పెరిగిందని ముఖ్యమంత్రి వివరించారు. ఫిష్ మీల్ టన్ను రూ.1.55 లక్షల నుంచి రూ.2.40 లకు పెరిగిందని, అలాగే చేప నూనె టన్ను రూ.2.80 లక్షల నుంచి రూ.4.40 లక్షలకు, సోయా లెసిథిన్ టన్నుకు రూ.68 వేల నుంచి రూ.1.10 లక్షలకు చేరిందన్నారు. రొయ్యల మేతకు సంబంధించి ఈ ముడిపదార్థాల భారం టన్నుకు రూ.25 వేల వరకూ పెరిగినట్టు సీఎం కేంద్రమంత్రికి వివరించారు. రొయ్యలు, ఆక్వాకల్చర్ ఉత్పత్తులకు సంబంధించి దేశీయ మార్కెట్ ను ప్రోత్సహించటం, ఎఫ్‌పీఓల ఏర్పాటు, మార్కెట్‌తో ఆక్వా రైతుల అనుసంధానం, దేశీయ మార్కెట్లలో బ్రాండింగ్, ప్రాసెసింగ్, రీటైల్ ధరల ఏకీకరణకు మద్దతు ఇవ్వటంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ హెచ్చుతగ్గుల నుంచి ఈ రంగానికి రక్షణ కల్పించాలని ముఖ్యమంత్రి కోరారు. దీని కోసం ఓ సంస్థాగత ఫ్రేమ్ వర్క్ ను రూపొందించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. రూ.100 కోట్ల కార్పస్ ఫండ్ తో ఆంధ్రప్రదేశ్ ప్రాన్ ప్రొడ్యూసర్స్ కో ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేసేందుకు ఎన్ఎఫ్ డీబీ ద్వారా నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కోరారు.

**అమెరికా రెసిప్రోకల్ టారిఫ్ పై సంప్రదింపులు జరపండి..** రాష్ట్రం నుంచి ఎగుమతి అయ్యే ఆక్వా ఉత్పత్తులపై అమెరికా విధిస్తున్న సుంకాలను తగ్గించేలా కేంద్రం సంప్రదింపులు జరపాలని సీఎం అభ్యర్థించారు. భారత్ నుంచి ఎగుమతి అవుతున్న రొయ్యలపై 5.77% కౌంటర్ వెయిలింగ్ డ్యూటీని అమెరికా విధించిందని అలాగే యాంటీ డంపింగ్ డ్యూటీ కూడా వేసేందుకు ఆలోచన చేస్తోందని సీఎం తెలిపారు. అమెరికా అధ్యక్షుడి రెసిప్రోకల్ టారిఫ్ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని సీఎం అన్నారు. భారత్ నుంచి ఎగుమతి అయ్యే రొయ్యల్లో 80 శాతం ఏపీ నుంచే వెళ్తున్నాయని, రెసిప్రోకల్ టారిఫ్ విధిస్తే రాష్ట్రంలోని 30 లక్షల మంది ఆక్వా కల్చర్ రంగంపై ఆధారప డిన వారి జీవనోపాధి దెబ్బ తినే ప్రమాదం ఉందన్నారు. అమెరి కాకు చేసే రొయ్య ఎగుమతులను కాపాడేం దుకు సీఫుడ్‌పై ప్రస్తుతం ఉన్న 30% కస్టమ్స్ సుంకాన్ని సున్నా కు తగ్గించాలని లేదా రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచు కుని దానిని మినహాయించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

IN THE COURT OF
HON'BLE VII ADDITIONAL
CIVIL (SENIOR DIVISION)
JUDGE AT VIJAYAWADA
E.P. No. 2 of 2023
in
O.S. No. 1140 of 2014
Between:
Yerra Baby Sarojini
--------DHR/Plaintiff
And
Allaparthi Nageswara Rao
--------JDR/Defendant
TO:
Allaparthi Nageswara Rao,
S/o Raja Rao,
Door No. 47-10-7,
Gundala, Vijayawada.

పై నెంబర్ గల దావా నందు పైన తెలిపిన ప్రతివాదులకి సమాన్లు అందజేయు నిమిత్తం ది. 21-07-2026 తేదీన కోర్టు వారు వాయిదా వేసినారు. కావున పైన తెలిపిన ప్రతివాది వాయిదా రోజున ఉదయం 10:30 లకు పై కోర్టువారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై వారికి గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల వారిపై పరోక్షమందు సదరుపై దావా తీర్మానం కాబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఇట్లు :
బి.వి.ఎస్.ఆర్. ప్రసాద్
వాది తరపున అడ్వకేట్
విజయవాడ
సెల్ : 9440 174 693

## గ్రామ పంచాయితీ కార్యాలయము, చంద్రాల
## వేలం పాట నోటీసు

తేది. 15-07-2026

మైలవరం మండలం, చంద్రాల గ్రామ పంచాయితీ పరిధిలో ఈ దిగువ తెలిపిన ఐటమ్ లకు బహిరంగ వేలంపాట ది.27-07-2026. సోమవారము ఉదయం 10 గంటలకు చంద్రాల గ్రామ పంచాయితీ కార్యాలయము నందు పంచాయితీ కార్యదర్శి వారిచే గాని, వారి అనుమతి పొందిన వారిచే గాని వేలంపాట నిర్వహించబడును. ఇతర విషయములు కొరకు పని వేళలో సంప్రదించగలరు.

| వ.నెం | ఐటమ్ పేరు | కాలము | చెల్లించవలసిన ధరావత్తు |
|---|---|---|---|
| 1) | పేరంటాలమ్మ చేపల చెరువు | 07-2026 TO 06-2029 | రూ.5000/- |
| 2) | తుమ్మల కుంట్ల చేపల చెరువు | 07-2026 TO 06-2029 | రూ.5000/- |
| 3) | పటమట చేపల చెరువు | 07-2026 TO 06-2029 | రూ.5000/- |
| 4) | పుల్లం బొట్ల చేపల చెరువు | 07-2026 TO 06-2029 | రూ.5000/- |
| 5) | షాపింగ్ కాంప్లెక్స్-1 | 07-2026 TO 06-2029 | రూ.5000/- |
| 6) | షాపింగ్ కాంప్లెక్స్-2 | 07-2026 TO 06-2029 | రూ.5000/- |
| 7) | షాపింగ్ కాంప్లెక్స్-3 | 07-2026 TO 06-2029 | రూ.5000/- |

సం/- వి.దుర్గాప్రసాద్‌రావు
పంచాయితీ కార్యదర్శి
గ్రామ పంచాయితీ,చంద్రాల

# దేశ అభివృద్ధిలో రైల్వేలది కీలకపాత్ర

**ప్రధాని చేతులమీదుగా ఆధునీకరించిన మంగళగిరి రైల్వేస్టేషన్ వర్చువల్ గా ప్రారంభం**

- దక్షిణ భారతదేశంలో నెం.1 రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతాం
- మంగళగిరికి పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉపాధి కల్పిస్తాం
- మంగళగిరి అమృత్ భారత్ స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్



**మంగళగిరి,జూలై 17 (వార్తాప్రభ) :** దేశ అభివృద్ధిలో రైల్వేలది కీలకపాత్ర అని, రైల్వే స్టేషన్ల ద్వారా ఆర్థికాభివృద్ధి జరగాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. 'అమృత్ భారత్ స్టేషన్ పథకం' కింద ?12.56 కోట్ల వ్యయంతో ఆధునీకరించిన మంగళగిరి రైల్వేస్టేషన్ ను ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ గా ప్రారంభించారు. రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తో కలిసి మంత్రి లోకేష్ పాల్గొన్నారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... దేశంలో అనేక సంస్థలు ఉన్నాయి. కేవలం ఒకే సంస్థ మొత్తం భారతదేశాన్ని కలుపుతోంది. అదే మన రైల్వే సంస్థ. మన జీవిత ప్రయాణంలో ఎప్పుడో ఒకప్పుడు రైల్వే ప్లాట్‌ఫారమ్‌పై వేచి చూసి ఉంటారు, రైలు కిటికీలోంచి బయటకు చూసి ఉంటారు లేదా భారతీయ రైల్వేలో ఒక ముఖ్యమైన ప్రయాణం చేసి ఉంటారు. అందుకే భారతీయ రైల్వే కేవలం ఒక వ్యవస్థ మాత్రమే కాదు, అది భారతదేశ జాతీయ సమైక్యత, సమగ్రతకు ఒకగొప్ప సాధనం. దేశ అభివృద్ధిలో రైల్వేలది కీలకపాత్ర. అందుకే ప్రధాని నరేంద్ర మోదీ గారు రైల్వే వ్యవస్థ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు.

**దేశం అభివృద్ధి చెందాలంటే రైల్వేలు అభివృద్ధి చెందాలి..** గతంలో దశాబ్దాల తరబడి భారతీయ రైల్వేలు రద్దీగా ఉండే స్టేషన్లు, ఆలస్యమయ్యే రైళ్లు, పాతబడిన మౌలిక సదుపాయాలకు మారుపేరుగా ఉండేవి. నేడు, ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. నేడు... వందే భారత్, బుల్లెట్ రైళ్లు, 'కవచ్' భద్రతా సాంకేతికత, 100% విద్యుదీకరణ, ఆధునిక సరుకు రవాణా కారిడార్లు, ఆధునీకరించిన రైల్వే స్టేషన్లు, హైడ్రోజన్ ఆధారిత రైళ్ల గురించి ప్రపంచం మాట్లాడుకుంటోంది. ఇది సాధారణ ఆధునీకరణ మాత్రమే కాదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారతీయ రైల్వేలో జరుగుతున్న అతిపెద్ద మార్పు ఇది. ఇది ఒక రైల్వే విప్లవం. దేశం అభివృద్ధి చెందాలంటే రైల్వేలు అభివృద్ధి చెందాలనేది ప్రధాని మోదీ గారి ఆలోచన. నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో, రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ గారి దార్శనికతతో, భారతీయ రైల్వే చరిత్రలోనే అతిపెద్ద ఆధునీకరణ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతోంది. వేలాది కిలోమీటర్ల నూతన రైల్వే లైన్లను నిర్మిస్తున్నారు. ముంబై--అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ భారతదేశానికి హై-స్పీడ్ రైలును తీసుకువస్తూ, ప్రపంచ ప్రమాణాలతో కూడిన మౌలిక సదుపాయాలను నిర్మించడానికి భారతదేశం సిద్ధంగా ఉందని నిరూపిస్తోంది. పర్యావరణహిత రవాణా రంగంలో ప్రపంచానికి నాయకత్వం వహించడానికి భారతదేశం సిద్ధంగా ఉందని హైడ్రోజన్ రైలు నిరూపిస్తోంది. మన మంగళగిరి రైల్వేస్టేషన్ లో ఎక్కువ రైళ్లు ఆగేలా చూడాలని ఈ సందర్భంగా పెద్దలను కోరుతున్నా.

# లేపాక్షి ద్వారా రాష్ట్ర హస్తకళలకు ప్రపంచ స్థాయి గుర్తింపు: మంత్రి సవిత

**న్యూఢిల్లీ, జూలై 17 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ హస్తకళలు, చేనేత ఉత్పత్తులను దేశ, విదేశీ మార్కెట్లలో మరింత విస్తృతంగా పరిచయం చేసి, కళాకారులకు స్థిరమైన ఉపాధి, మెరుగైన ఆదాయం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చేనేత, జౌళి, బీసీ సంక్షేమం, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత అన్నారు. సంప్రదాయ కళలను పరిరక్షించడంతో పాటు ఆధునిక మార్కెట్ అవకాశాలతో అనుసంధానం చేస్తూ కళాకారుల జీవనోపాధిని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె చెప్పారు. న్యూఢిల్లీలోని బాబా ఖరాక్ సింగ్ మార్గ్‌లోని స్టేట్ ఎంపోరియా కాంప్లెక్స్‌లో పునరుద్ధరించిన లేపాక్షి హస్తకళల ఎంపోరియంను శుక్రవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, దేశ రాజధానిలోని ఈ లేపాక్షి ఎంపోరియం ఆంధ్రప్రదేశ్ కళా వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. దేశ విదేశాల నుంచి వచ్చే కొనుగోలుదారులు, పర్యాటకులు, కళాభిమానులకు రాష్ట్ర హస్తకళలు, చేనేత ఉత్పత్తులను చేరువ చేస్తూ కళాకారులకు కొత్త మార్కెట్లను తెరుస్తుందని తెలిపారు. సంప్రదాయ కళలకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంలో లేపాక్షి కీలక పాత్ర పోషిస్తుందని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ సలహాదారు సుచిత్ర ఎల్లా మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌కు గొప్ప హస్తకళలు, చేనేత వారసత్వం ఉందని, వాటిని జాతీయ, అంతర్జాతీయ



మార్కెట్లకు తీసుకెళ్లడంలో లేపాక్షి కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఆధునిక సౌకర్యాలతో సంప్రదాయ కళలను ప్రజలకు మరింత చేరువ చేసేలా ఎంపోరియంను తీర్చిదిద్దినట్లు చెప్పారు. లేపాక్షి చైర్మన్ పసుపులేటి హరి ప్రసాద్ మాట్లాడుతూ, న్యూఢిల్లీ షోరూమ్ రాష్ట్ర కళాకారులకు మరింత మార్కెట్ అవకాశాలు కల్పిస్తుందని, జీఐ ట్యాగ్ పొందిన ఉత్పత్తులతో పాటు సంప్రదాయ హస్తకళలకు విస్తృత ప్రచారం లభిస్తుందని తెలిపారు. లేపాక్షి మేనేజింగ్ డైరెక్టర్ విశ్వ మనోహరన్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల హస్తకళలు, చేనేత ఉత్పత్తులను ఒకేచోట అందుబాటులో ఉంచేలా ఎంపోరియంను ఆధునికంగా అభివృద్ధి చేశామని తెలిపారు. కొండపల్లి, ఎటికొప్పాక బొమ్మలు, బొబ్బిలి వీణ, కలంకారీ చిత్రాలు, రాతి శిల్పాలు, ఇత్తడి కళాఖండాలు, గిరిజన కళాఖండాలు, మంగళగిరి, ఉప్పాడ, గద్వాల్, చీరాల, నారాయణవనం, పెదన కలంకారీ చీరలు తదితర ఉత్పత్తులు ఇక్కడ అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ కుమార్, చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి, అధికారులు, కళాకారులు, పలువురు ఆహ్వానితులు పాల్గొన్నారు.

కుసుమ హాస్పటల్స్ టౌన్ రైల్వేస్టేషన్ దగ్గర, రామారావుపేట, కాకినాడ
- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు E.H.S. పథకంలో మరియు ఆరోగ్య శ్రీ ద్వారా అర్హులైన రోగులకు
- ఆర్థోపెడిక్స్ ● జనరల్ సర్జరీ ● పాలిట్రామా ● ఇఎన్‌టి వంటి సేవలు ఈ హాస్పిటల్ నందు లభించును.
- అన్ని ఇన్సూరెన్స్ కంపెనీలకు కేష్‌లెస్ మరియు రీఎమ్‌బెర్స్‌మెంట్ సదుపాయం కలదు.

కుసుమ హాస్పటల్స్
# 7-7-5/2, Cement Road, Near Town Rly. Station, Ramaraopeta,
KAKINADA - 533 004.
E-mail : kusumahospital86@gmail.com
Phone : 0884 - 2376229

## చదువుకు చేయూత.. విద్యార్థికి రూ.10 వేల అందజేత



**హనుమాన్‌జంక్షన్,జూలై 17 (వార్తాప్రభ) :** మానవతా హనుమాన్‌జంక్షన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. అప్పనవీడు గ్రామానికి చెందిన కొర్లపు పాపారావు కుమారుడు గణేష్ ఏలూరులోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో బీబీఎం మూడో సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల ఫీజుల చెల్లింపునకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న మానవతా హనుమాన్‌జంక్షన్ సభ్యులు స్పందించి రూ.10 వేల ఆర్థిక సహకారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులతో విద్యకు దూరమవుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు అండగా నిలవడం తమ సంస్థ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవతా హనుమాన్‌జంక్షన్ చైర్మన్ మారపోయిన కోటేశ్వరరావు, కార్యదర్శి గణేష్, డైరెక్టర్లు రామచంద్రరావు, సుబ్బారావు, రాజేశ్వర రావు, ట్రెజరర్ వెంకటస్వామి, కార్యవర్గ సభ్యులు శ్రీధర్, శ్రీరామమూర్తి, నరసింహారావు, కృష్ణా జిల్లా కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలతో మమేకమవుతున్న ఆశావహులు




**విస్సన్నపేట,జూలై 17 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికలలో పోటీ చేసేందుకు ఉత్సాహం చూపిస్తున్న ఆశావహులు ప్రజలతో మమేకం అవ్వటం జరుగుతోంది. గతంలో నరసాపురం మారేమండ తెల్లదేవరపల్లి గ్రామాలు టిడిపి మద్దతు అభ్యర్థులు విజయం సాధించగా కొండ పర్వ తాతకుంట్ల వేమిరెడ్డిపల్లి కలగర కొర్లమండ పుట్రేల చంద్రుపట్ల చంద్రుపట్ల ఎల్టి పంచాయతీలు ఆనాటి అధికార వైసిపి మద్దతు అభ్యర్థులు విజయం సాధించడం తెలిసిందే. నవంబర్ నెలలో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలలో పూర్తి స్థానాలను తామే విజయ దుందుభి మ్రోగించాలని ఇటు అధికార పార్టీ అటు ప్రతిపక్ష పార్టీలు చాప కింద నీరుల వార్డు స్థాయి నుండి పావులు కదుపుతున్నారు. గ్రామాలలో డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు, వీధిలైట్లు, త్రాగునీరు తదితర మౌలిక వసతులు అందించడంతో పాటు శుభకార్యాలకు హాజరు కావడం ఆశీస్సులు అందించటం మరోవైపు చనిపోయిన వారికి నివాళులర్పించడం కుటుంబ సభ్యులను పరామర్శించడం పేద కుటుంబాలకు ఆర్థిక చేయూత అందించటం తదితర కార్యక్రమాలకు హాజరై భరోసా ఇవ్వడం జరుగుతోంది. రాబోయే ఎన్నికలలో పోల్ మేనేజ్మెంట్ పై అపార అనుభవం కలిగిన రాజకీయ చాణిక్యుల ఎత్తులకు పైఎత్తులు మధ్య గ్రామపంచాయతీ ఎన్నికలంటే నల్లేరుపై నడక కాదని టైట్ పొజిషన్ ఉంటుందని పలువురు అనుకుంటున్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



**తిరువూరు,జూలై 17 (వార్తాప్రభ) :** తిరువూరు మండలంలోని మల్లెల గ్రామంలో మద్దిరెడ్డి శ్రీనివాసరెడ్డి పొలంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్న డ్రమ్ సీడర్ ద్వారా వరి విత్తే విధానాన్ని మండల వ్యవసాయ అధికారి పి పద్మ పరిశీలించారు. డ్రమ్ సీడరు ద్వారా వరి పంట వేయడానికి ఎకరానికి 10 నుంచి 12 కిలోల విత్తనాలు సరిపోతాయి. నేలను బాగా దమ్ము చేసుకుని నీటిని తీసివేసి బురద పదును ఉన్నప్పుడు డ్రం సిడర్ను పొలంలో లాగాలి. ఈ విధానం ద్వారా వరి విత్తనాలు వరుసల్లో పడతాయి. సాంప్రదాయ వరి నాటు వేసే విధానంలో ఎకరానికి అయ్యే కూలీల ఖర్చును కేవలం డ్రం సిడరు ఒక వ్యక్తి లాగడం ద్వారా కూలీల ఖర్చులు 4-5 వేల వరకు తగ్గించుకోవచ్చును. విత్తనాలు వరుసలో పడటం వలన మొక్కలకు గాలి వెలుతురు తగలడం వలన చీడపీడల ఉధృతి తగ్గుతుంది, పిలకలు అధికంగా చేస్తాయి. వరుసల మధ్యలో పవర్ వీడర్ ద్వారా కలుపును సులభంగా తీయవచ్చును. కావున రైతులు డ్రమ్స్ లీడర్ ద్వారా కూడా మరిన్ని విత్తవచ్చని తెలియజేశారు. డ్రం సీడరు మల్లెల బిఆర్సి సెంటర్లో కందిమల్ల అప్పారావు గారి వద్ద ఉంది. కావున ఆసక్తి ఉన్న రైతులు డ్రం సీడర్ను ఉపయోగించుకొని వరి పంటను పండించవచ్చును. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు ఆర్ఎస్కే సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా బడే శేషగిరిరావు జన్మదిన వేడుకలు



**కోడూరు,జూలై 17 (వార్తాప్రభ) :** ప్రముఖ న్యాయవాది బడే శేషగిరి రావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు సందర్భంగా హంసలదీవి లోని శ్రీ వేణు గోపాల స్వామి వారి ఆలయంలో పూజ కార్యక్రమాలు నిర్వహించారు, తదనంతరం హంసలదీవి కరకట్టపై నివసిస్తున్న 100 కి పైగా యానాది కుటుంబాలకు వారి మిత్ర బృందం అన్నదానం నిర్వహించారు ఈ కార్యక్రమంలో మాజీ నీటి సంఘ అధ్యక్షుడు వర్రే బసవరావు, అద్దంకి శేషు, ఉల్లిపాలెం పీఏసీఎస్ మాజీ చైర్ పర్సన్ కటకం కుటుంబరావు, బడే బసవయ్య, గల్లా జితేంద్ర, బడే రమేష్, బడే నారాయణ స్వామి, డి.నరేష్,డి.శ్రీనివాస్, గల్లా జితేంద్ర, కె. శివనాగరాజు, రెడ్రౌత్తు వెంటకేశ్వరరావు, కోట రంగారావు, సైకం రాంబాబు, కె.గిరిధర్, టి. శ్రీనివాసరావు, అయోధ్య మల్లి తదితరులు పాల్గొన్నారు.

## ఇంధన భద్రత,పర్యావరణ పరిరక్షణపై అవగాహన





**మైలవరం,జూలై 17 (వార్తాప్రభ) :** స్థానిక లకిరెడ్డి బాలి రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఇంధన భద్రత , పర్యావరణ పరిరక్షణ మరియు గ్రీన్ హైడ్రోజన్ వినియోగం పై శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది.మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో, అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ మరియు కేంద్ర ప్రభుత్వ సంస్థ (సెర్బ్) సంయుక్త సహకారంతో రెండు రోజులు (17-7-26 మరియు 18-7-26 వరకు ) అవగాహ సదస్సు జరగనుంది.ఈ కార్యక్రమంలో ఐఐఎస్ బెంగళూరు నుంచి డా.ఆనంద్ శివపూజి, ఐఐటి డా.సత్యశేఖర్ భోగీ, ఐఐటీ జమ్మూ మరియు డా.సందీప్ కుమార్ , అసోసియేట్ ప్రొఫెసర్,ఐఐటి ముంబై వారు రిసోర్స్ పర్సన్స్ గా వ్యవహరించారు.ఈ సందర్భగా డా.ఆనంద్ శివపూజి మాట్లాడుతూ వ్యర్థాల నుంచి స్వచ్ఛమైన ఇంధనాన్ని ఉత్పత్తి చేయటానికి బయో - రెసిడ్యూస్ (వ్యవసాయ అవశేషాలు) మరియు ఆక్సీ-స్టీమ్ గ్యాసిఫికేషన్ ప్రక్రియ అత్యంత ప్రభావంతమైనదని మరియు దాని ద్వారా వ్యవసాయ వ్యర్థాలను అధిక ఉష్ణో గ్రత ల వద్ద సిన్-గ్యాస్ గా మారుస్తారని వివరించారు. డా.సత్య శేఖర్ భోగీ ప్రసంగిస్తూ భవిష్యత్ ఇంధన అవసరాలకు హైడ్రోజన్ ఒక అద్భుతమైన మార్గమని పేర్కొన్నారు. అయితే హైడ్రోజెన్ ఉత్పత్తి, నిల్వ మరియు ఫ్యూయల్ సెల్ పని చేసే సమయంలో అధిక ఉష్ణోగ్రత విడుదలవుతుందని , వ్యవస్థల సామర్థ్యాన్ని మరియు మన్నికను పెంచడానికి ఈ ఉష్ణోగ్రత ను సరిగా నియంత్రించడం అత్యంత కీలకమని వివరించారు.అనంతరం డా.సందీప్ కుమార్ మాట్లాడుతూ గ్రీన్ హైడ్రోజెన్ బెలూన్ శాటిలైట్ హైబ్రిడ్ సిస్టం అనేది ఒక విప్లవాత్మకమైన అంతరిక్ష సాంకేతికత అని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ ఫ్యూయల్ సెల్ ద్వారా నిరంతరా యంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తూ బెలూన్ ఫ్లాట్ ఫారములు ఎక్కువ కాలం గాల్లో ఉండేలా మరియు అంతరిక్ష శాటిలైట్లకు శక్తిని అందించ డానికి ఉపయోగపడుతుందని వివరించారు.ఈ కార్యక్రమానికి డా.పి.విజయ్ కుమార్ మరియు డా.పి .రవీంద్ర కుమార్ కో ఆర్డినేటర్లుగా వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు,డా.ఎస్.పిచ్చి రెడ్డి, డీన్ (ఆర్ అండ్ డి), డా.ఎమ్ .బి.ఎస్ శ్రీకర రెడ్డి , మెకానికల్ విభాగాధిపతి , అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓసి అసెంబ్లీ నియోజకవర్గం విస్సన్నపేట




**విస్సన్నపేట,జూలై 17 (వార్తాప్రభ) :** డిలిమిటేషన్ కార్యక్రమంలో భాగంగా ఎంపీ వెనుక ఉండే జనాభాను సమానంగా చేయడానికి మ్యాపు మార్చే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పథక చేస్తున్న ఈ తరుణంలో విస్సన్నపేట ఓసి నియోజకవర్గంగా రూపాంతరం చెంది అవకాశముంటుందని రాజకీయ మేధావులు అనుకుంటున్నారు. కేవలం సరిహద్దుల సమస్య మాత్రమే కాకుండా దేశ రాజకీయ శక్తి సమతుల్యతను మార్చే అంశంగా ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందని పలుచోట్ల వినిపిస్తోంది. ప్రస్తుతం మాన్సూన్ సీజన్ లో మరల బిల్లు తీసుకురావాలని ఎన్డీఏ ప్రయత్నిస్తోంది. ఆర్టికల్ 82 ప్రకారం జనాభా లెక్కల తర్వాత నియోజకవర్గం మళ్లీ నిర్ణయించాలి అనే లక్ష్యంతో ఎంపీ మరియు ఎమ్మెల్యే దగ్గర దాదాపు సమాన జనాభా ఉండేలా చేయటం అంటే ఒక సీటు ఒక విలువ అనే చందంగా 543 లోక్ సభ సీట్లను 850 చెట్లకు పెంచాలనె ప్రతిపాదన వాటిలో ఎనిమిది వందల 15 సీట్లు రాష్ట్రాల నుండి 35 కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ఉండే విధంగా చూస్తున్నట్టు తెలుస్తోంది. చాలా రాష్ట్రాల్లో 50 శాతం సీట్లను పెంపు ఫార్ములా పెంచాలని సూచించడం జరుగుతుంది. యూపీ 80 నుండి 120 తమిళనాడు 39 నుండి 59 ఏపీ 25 నుండి 38 తెలంగాణ 17 నుండి 26 ఎంపీ స్థానాలు పెరిగే అవకాశం ఉంటుందని 33 శాతం మహిళా రిజర్వేషన్ అమలు చేయటానికి అదే విధంగా అసెంబ్లీ స్థానాలు కూడా పెంచే లక్ష్యంగా ముందుకు వెళ్లడం జరుగుతుంది అని తెలుస్తోంది. ఇదే జరిగితే విసన్నపేట పరిసర ప్రాంత మండలాలను కలుపుకొని నియోజకవర్గంగా రూపాంతరం చెందే పరిస్థితి ఉంటుందని ఇప్పటికే పలువురు ల్యాండ్ లార్డులు విద్యాసంస్థల అధినేతలు ఎన్ఆర్ఐలు బంగారు షాప్ యజమానులు ట్రాన్స్పోర్ట్ యజమానులు తమ ప్రయత్నాలు చేసుకుంటున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం అందుతుంది.

## బొమ్మలూరులో ఉచిత ఆయుష్ వైద్య శిబిరం.. 124 మందికి వైద్య సేవలు

- 43 మందికి రక్తంలో చక్కెర పరీక్షలు.. వివిధ వ్యాధులకు ఉచిత మందుల పంపిణీ







**హనుమాన్ జంక్షన్,జూలై 17 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం బొమ్మలూరు గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం ఉచిత ఆయుష్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కానుమోలు గ్రామానికి చెందిన ప్రభుత్వ ఆయుష్ (ఆయుర్వేద) వైద్యురాలు డాక్టర్ వాహిని, గొల్లపల్లి చిన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి గ్రామస్తులు విశేషంగా హాజరయ్యారు. శిబిరంలో మొత్తం 124 మందికి ఉచిత వైద్య సేవలు అందించారు. వీరిలో 43 మందికి ర్యాండమ్ బ్లడ్ షుగర్ పరీక్షలు నిర్వహించి, మధుమేహ లక్షణాలు గుర్తించిన వారికి ఉసిరికాయ, పసుపుతో తయారు చేసిన నిషామలకి నిషా అమలకి చూర్ణం(ఆయుర్వేదిక్ మెడిసిన్) పంపిణీ చేశారు. అలాగే నడుము నొప్పులు, మోకాళ్ల నొప్పులు, చర్మవ్యాధులు, అజీర్ణం తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆయుర్వేద మందులను ఉచితంగా అందజేశారు. ప్రజలు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకొని, ఆయుష్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ వాహిని సూచించారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి చిన్న, కాశి, బాపులపాడు ఎంపీడీవో, బొమ్మలూరు ఈవో, గ్రామ పెద్దలు, నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## శ్వాస కోశ సమస్యల పరిష్కారంకు కేరాఫ్ అడ్రస్ యోగ

- జ్వరం, దగ్గు, గొంతు నొప్పి అలసట, శరీర నొప్పులు, తలనొప్పి
- వాసన, రుచి తెలియకపోవడం
- శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది



**విస్సన్నపేట,జూలై 17 (వార్తాప్రభ) :** వికారం, అతిసారం వంటి లక్షణాలతో కరోనా వచ్చినట్లు 20 19 లో నిర్ధారణ జరిగేదని అనుకుంటున్నారు. కొత్తగా గుర్తించిన నాడీ సంబంధిత లక్షణాలు తలనొప్పి, మైకం, స్ట్రోక్, అప్రమత్తంగా ఉండలేకపోవడం. ఇవి జ్వరం, దగ్గు కంటే ముందే కూడా రావచ్చు అని చెప్పుకుంటున్నారు. సర్వ సాధారణంగా అంటువ్యాధులు సోకిన వ్యక్తి దగ్గు/తుమ్ము ద్వారా వైరస్ ఉన్న ఉపరితలాన్ని తాకి, తర్వాత కళ్ళు, ముక్కు, నోరు తాకడం జరుగుతోందని 60 ఏళ్లు పైబడిన వారు, బీపీ, గుండె ఊపిరితిత్తుల సమస్యలు, డయాబెటిస్, ఒబిసిటీ, క్యాన్సర్ ఉన్నవారు. కానీ ఇతర వారికి ఇమ్యూనిటీ పవర్ తక్కువగా ఉన్న వారికి తీవ్రమవ్వచ్చు అని తెలుస్తోంది.మాస్కు ధారణ, 2 గజాల భౌతిక దూరం చేతులు తరచుగా కడుక్కోవడం, ముఖాన్ని తాకకుండా ఉండడం- రద్దీని తగ్గించడం,టెస్ట్, ట్రాక్, ట్రీట్ వ్యూహం అర్హులైన వారు టీకాలు మరియు ప్రికాషన్ డోస్ వేయించుకోవడం అవసరమంటున్నారు. ప్రశాంత వాతావరణంలో యోగా చేయటం వల్ల సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చు అని సర్వత్రా వినిపిస్తుంది.

## శ్రీ వేంకటేశ్వరుని సన్నిధిలో ఏర్పాట్లు...



**గుడ్లవల్లేరు,జూలై 17 (వార్తాప్రభ) :** మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలోని భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారిని శనివారం దర్శించుకోనున్న భక్తకోటికి శుక్రవారం విస్తతంగా ఏర్పాట్లు చేశారు. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి జరిగే ప్రత్యేక పూజలు, విశేషాభిసేకాలను నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు కె.బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే వేలాది భక్తులు విచ్చేస్తున్న ఈ ఆలయంలో మండు వేసవిలో భక్తులెవరూ ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు మంచినీటితో పాటు అన్నసమారాధన ఏర్పాట్లను బాపిరెడ్డి, భాస్కరమ్మ దంపతులు పర్యవేక్షిస్తున్నారు.

## జూలై 18న ప్రత్యేక లోక్ అదాలత్..

### -15వ అదనపు జిల్లా జడ్జి శ్రీమతి డి సత్యవతి



**నూజివీడు, జూలై 17 (వార్తాప్రభ) :** నూజివీడు మండల సేవాధికార సంస్థ నూజివీడు వారి ఆధ్వర్యంలో జులై నెల 18 వ తేదీ అనగా శనివారము ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు నూజివీడు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు 15వ అదనపు జిల్లా జడ్జి శ్రీమతి డి. సత్యవతి గారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసుల పరిష్కారానికి సుముఖంగా ఉన్న కక్షిదారులు తమ న్యాయవాది ద్వారా ఇరు పార్టీలు హాజరు కావడం ద్వారా రాజీ కుదుర్చుకొని తద్వారా ఖర్చు,సమయం,ఆదా చేసుకోవచ్చు అని తెలిపారు. ఈ లోక్ అదాలత్ లో ఎన్.ఐ. యాక్ట్ కేసెస్ (చెక్ బౌన్స్ కేసులు) పరిష్కరించుకోవచ్చు అని తెలిపారు. ఇతర వివరములకు, సందేహములకు నూజివీడు కోర్టు ప్రాంగణంలోని మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవలసిందిగా జడ్జి గారు తెలిపారు.

## నూకాలమ్మ ఆలయంలో విహెచ్ పి ప్రత్యేక పూజలు



**మచిలీపట్నం,జూలై 17 (వార్తాప్రభ) :** విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా అధ్యక్షులు డా. బూరగడ్డ శ్రీనాథ్ సూచనల మేరకుస్థానిక రాజు పేటలోని శ్రీ నూకాలమ్మ అమ్మవారి దేవాలయంలో ఆషాఢ మాసం శుక్రవారం సందర్భంగా విశేష పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్తు ప్రతినిధులు జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం గురువిందపల్లి విజయకుమార్ (న్యాయవాది) వార్డు ఇన్‌చార్జి కొడాలి అంజయ్య సతివాడ నాగమణి నక్క రమణమ్మ కనుగొట్టి చిన్నారి పినిశెట్టి నాగమణి తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా హిందూ సమాజ శ్రేయస్సు దేశాభివృద్ధి, ప్రజల ఆయురారోగ్యాలు సుఖశాంతులు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు.అలాగే హిందూ ధర్మ పరిరక్షణ, సమాజ సేవ జాతీయ పునర్నిర్మాణ లక్ష్యాలతో పనిచేస్తున్న విశ్వ హిందూ పరిషత్ కార్యక్రమాలలో భక్తులు చురుకుగా పాల్గొని, సభ్యులుగా చేరి సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.

## ఇంటర్మీడియట్ విద్యార్థినిలకు నోట్ బుక్స్, పెన్నుల పంపిణీ..



**గిద్దలూరు,జూలై 17 (వార్తాప్రభ) :** గిద్దలూరు పట్టణంలోని జడ్.పి.హెచ్.ఎస్ ప్లస్ నందు చదువుతున్న 70 మంది విద్యార్థినీలకు ఇదే పాఠశాలలో పీ.జి.టీ లు గా పనిచేస్తున్న డాక్టర్ మొర్రి. పిచ్చయ్య మరియు మొరసా. బాల గురవయ్య గార్లు తమ సొంత నిధులను నుంచి 15 వేల రూపాయలు ఖర్చు చేసి 70 మంది విద్యార్థినీలకు అవసరమైన నోటుబుక్స్, పెన్నులు తదితర స్టేషనరిని హై స్కూల్ ప్లస్ ప్రిన్సిపాల్ సిద్దేశ్వర శర్మ గారి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది ప్రిన్సిపాల్ సిద్దేశ్వర శర్మ మాట్లాడుతూ విద్యార్థినీలకు జేఈఈ మెయిన్స్, నీట్ కు సంబంధించిన ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు. దాతలు డాక్టర్ మొర్రి. పిచ్చయ్య, మైరసా బాల గురువయ్య లు మాట్లాడుతూ విద్యార్థినిలు ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకోని లక్ష్య సాధన కోసం కష్టపడి క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను చేరాలని మోటీషనల్ స్పీచ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పిజిటిల సిబ్బంది సగీర్, శ్రీరామిరెడ్డి, రాజేంద్రప్రసాద్, శోభారాణి, వెంకాయమ్మ గార్లు పాల్గొని దాతలు మొరసా బాలగురువయ్య, డాక్టర్ మొర్రి. పిచ్చయ్యలను అభినందించగా, విద్యార్థినీలు ధన్యవాదాలు తెలిపారు

## వందలాది మహిళా భక్తులతో కోటి కుంకుమార్చన...





**గుడ్లవల్లేరు,జూలై 17 (వార్తాప్రభ) :** మండల కేంద్రంలోని శ్రీ మద్దంగా పార్వతీ సమేత శ్రీ సిద్ధేశ్వరస్వామి వారి దేవస్థానములో 250మంది మహిళా భక్తులతో శ్రీ దశ లక్షా సంఖ్యాక లలితా సహస్ర నామపూర్వక కోటి కుంకుమార్చన మహా యజ్ఞము నిర్వహించారు. శుక్రవారం మంగళ వాయిద్యములు, అభిషేకము, గోపూజ, శ్రీచక్రార్చన, బాలపూజ, సువాసినీ పూజ, భైరవ పూజలను వేద పండితులు వేద మంత్రోచ్ఛరణ నడుమ నిర్వహించారు. అనంతరం శ్రీ వన దుర్గా హోమాన్ని వేద పండితులు చేపట్టారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ కొసరాజు వెంకటాద్రిచౌదరి(పెదబాబు), నిర్వాహకులు అన్నే ప్రసాదరావు, అడుసుమిల్లి వీరభద్రరావు, దేవస్థాన ఈఓ ఆర్.వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటిన హరీష్ రెడ్డి!!

**అనారోగ్య బాధితుడికి ఆర్థిక సహాయం**
**విహెచ్ఆర్ టీం ద్వారా డబ్బులు అందజేత**



**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 17 (వార్తాప్రభ):** గోదావరిఖనిలోని విజయనగర్ కాలనీకి చెందిన ముల్కాల మోహన్ రావు కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స మరియు మందుల ఖర్చుల నిమిత్తం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం విహెచ్ఆర్ సభ్యుల ద్వారా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి దృష్టికి వెళ్లింది. విషయం తెలుసుకున్న వెంటనే మానవతా దృక్పథంతో స్పందించిన వ్యాల్ల హరీష్ రెడ్డి, మోహన్ రావు వైద్య చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని తన అనుచరుల చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు. ముల్కాల మోహన్ రావు త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. కష్టకాలంలో ఆదుకున్న హరీష్ రెడ్డకి మోహన్ రావు కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అవసరంలో ఉన్నవారికి అండగా నిలిచి తక్షణమే సహాయం అందించడం పట్ల స్థానిక ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు తనని అభినందిస్తున్నారు.

# 3 కోట్లతో బందంపల్లి మినీ ట్యాంక్ బండ్!!

- బందంపల్లిలో తీగల వంతెన నిర్మాణం
- పెద్దపల్లి సుందరీకరణకు మరో అడుగు
- నాణ్యతతో పనులు పూర్తి చేయాలి
- విప్ చింతకుంట విజయ రమణరావు





**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 17 (వార్తాప్రభ):** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేస్తూ పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బందంపల్లి చెరువు కట్టను రూ.3 కోట్ల వ్యయంతో మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తెలిపారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్, సంబంధిత అధికారులతో కలిసి నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన, ప్రజలకు ఆహ్లాదకరమైన విహార ప్రదేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు తెలిపారు. మినీ ట్యాంక్ బండ్‌కు మరింత ఆకర్షణ తీసుకురావడానికి చెరువుపై తీగల వంతెన (సస్పెన్షన్ బ్రిడ్జి) కూడా నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరితగతిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి రాజీ పడకుండా పనులు పూర్తి చేయాలని గుత్తేదారులకు స్పష్టం చేశారు. చెరువు కట్ట అభివృద్ధికి అవసరమైతే అదనపు నిధులు కూడా తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి వచ్చే ఈ మినీ ట్యాంక్ బండ్ పెద్దపల్లి పట్టణానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టణాన్ని దశలవారీగా సుందరంగా, ఆధునికంగా తీర్చిదిద్దే దిశగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నుగుల్లా మల్లయ్య, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, స్థానిక కౌన్సిలర్ పురేళ్ల శైలజా సుధాకర్, ఇరిగేషన్ శాఖ అధికారులు, పట్టణ కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 21వ డివిజన్లో సమస్యలను పరిష్కరించండి

**ఎంపీలకు వినతి పత్రం ఇచ్చిన కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి**





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలై 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ 21 వ డివిజన్ పరిధిలోని జిల్లా శాఖ గ్రంధాలయంలో అభివృద్ధి కార్యక్రమ శంకుస్థాపనలో పాల్గొన్నరాజ్యసభ సభ్యులు,మాజీ కేంద్ర మంత్రివర్యులు గారపాటి రేణుకా చౌదరి, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి లను కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి దంపతులు సన్మానించారు అనంతరం ఆమె మాట్లాడుతూ కోరిన వెంటనే నిధులు సమకూర్చిన గ్రంథాలయ ఛైర్మెన్, ఎంపీ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఈ ప్రాంత అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన రేణుకా చౌదరి రామసహాయం రఘురామిరెడ్డిని డివిజన్ అబివృద్ధికి నిధులు సమకూర్చాలని కోరారు. వారికి డివిజన్ లో గల సమస్యల పైన వినతి పత్రం ఇచ్చారు. స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు అని తెలిపారు

# సౌండ్ బాక్స్ లేని సింగరేణి స్టార్స్!!

● క్రీడాకారులకు కిట్లు.. కళాకారులకు మొండిచెయ్యా? ● సీఈఆర్ క్లబ్ లో గది ఇవ్వండి.. మా కలలకు చోటివ్వండి ● పతకాలు మేము తెస్తే.. పరికరాలు మాకు లేవు ● ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్యకు వినతి



**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 17 (వార్తాప్రభ):** సింగరేణి కంపెనీలో క్రీడాకారులకు ప్రతి ఏటా లక్షల విలువైన క్రీడా సామగ్రి, జెర్సీలు, కిట్లు అందిస్తున్న యాజమాన్యం, అదే కంపెనీ పరువును కోల్ ఇండియా స్థాయిలో నిలబెడుతున్న కళాకారుల విషయంలో మాత్రం మౌనం వహిస్తోందని సింగరేణి ఉద్యోగ కళాకారుల సంక్షేమ సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉద్యోగ బాధ్యతలను తూ.చ. తప్పకుండా నిర్వహిస్తూనే, సింగరేణి డే ఉత్సవాలు, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు, ప్రతి ఏటా జరిగే రక్షణ వారోత్సవాలు, కంపెనీ వార్షిక క్రీడా సాంస్కృతిక పోటీల్లో అదిరే ప్రదర్శనలు ఇస్తూ కార్మిక వర్గాన్ని చైతన్య పరుస్తున్నామని, అయినా తమకు కనీసం ఒక్క సంగీత వాయిద్యం, ఒక్క కాస్ట్యూమ్ కూడా ఇప్పటివరకు కంపెనీ సమకూర్చలేదని కళాకారులు వాపోయారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సింగరేణి ఉద్యోగ కళాకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కనకం రమణయ్య, ఉపాధ్యక్షులు బోయిన రాజారాం, ప్రధాన కార్యదర్శి బుంభక్ రాకేష్, సంయుక్త కార్యదర్శి కోల క్రిష్ణస్వామి, సహాయ కార్యదర్శి తాళ్లపెల్లి నారాయణ, కోశాధికారి గీసల రామారావు, సభ్యులు అరవింద్ తదితరుల బృందం ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్యని కలిసి వినతిపత్రం అందజేశారు. కళాకారులకు వెంటనే సంగీత వాయిద్య పరికరాలు అందజేయాలని, అలాగే రోజూ ప్రాక్టీస్ చేసుకోవడానికి సీఈఆర్ క్లబ్ లో ఒక ప్రత్యేక గదిని కేటాయించాలని, ఈసారి వార్షిక క్రీడా సాంస్కృతిక పోటీలు ప్రారంభం కాకముందే ఈ సమస్యకు పరిష్కారం చూపాలని వారు సూటిగా డిమాండ్ చేశారు. కళాకారుల న్యాయమైన డిమాండ్లను విన్న జీఎం బండి వెంకటయ్య సానుకూలంగా స్పందించారని, త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని సంఘం నాయకులు తెలిపారు.

# సైబర్ నేరాలపై ప్రజలను నిత్యం అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలి

**సీసీటీఎన్ఎస్ 2.0, ఈ-సాక్ష్య వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలి**





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలై 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజువార్షిక తనిఖీలలో భాగంగా శుక్రవారం సందర్శించారు. ముందుగా కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ పుష్పగుచ్ఛం అందించి జిల్లా ఎస్పీకి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించే సిబ్బంది నుంచి జిల్లా ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో వాహనాల సంరక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల షెడ్‌ను జిల్లా ఎస్పీ ప్రారంభించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించే సిబ్బంది ప్రభుత్వ కిట్ ఆర్టికల్స్‌ను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, అధికారులకు మరియు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని ఎస్పీ సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల నమోదు, దర్యాప్తు సంబంధిత వివరాలను ఎప్పటికప్పుడు సక్రమంగా అప్‌డేట్ చేయాలని, సీసీటీఎన్ఎస్ 2.0, ఈ-సాక్ష్య అందుబాటులో ఉన్న సాంకేతిక సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో వర్టికల్స్ వారీగా విధులు నిర్వర్తించే సిబ్బందిని ఒక్కొక్కరిగా వారి పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా పోలీస్ స్టేషన్ పరిధిలో నిత్యం అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ తెలిపారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిరంతరం సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. డయల్--100కు ఫోన్ రాగానే సంఘటనా స్థలానికి వేగంగా చేరుకుని బాధితులకు అండగా నిలవాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో పనిచేసే అధికారులు, సిబ్బంది సమస్యలను జిల్లా ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీతో పాటు అధికారులు పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, సీఐ ఆర్. వెంకటేశ్వర్లు, ఎస్సై రమాదేవి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నో కన్ఫ్యూజన్.. నో టెన్షన్!!

● ఎస్.ఐ.ఆర్. ఫారం నింపడం ఈజీ ● మీ ఓటు భద్రం, ఇప్పుడే చెక్ చేసుకోండి ● పాత డేటా లేదని దిగులు వద్దు ● మార్పు కోసం మీ ఓటు హక్కును వదులుకోవద్దు ● డబుల్ ఓట్లు, మరణించిన వారి ఓట్లకే కత్తెర ● జెన్యూన్ ఓటర్లకు ఇక ఫుల్ భరోసా ● గందరగోళం వీడండి, జాబితాలో మీ పేరు చూసుకోండి ● గందరగోళం వీడండి, గతం వివరాలు లేదని దిగులు పడకుండా ఓటరు జాబితాలో మీ పేరు చూసుకోండి! నకిలీ ఓట్లకే కత్తెర తప్ప.. నిజమైన ఓటర్లందరికీ ఈ వ్యవస్థ పనితీరుపై "వార్తాప్రభ" స్పెషల్ స్టోరీ




**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 17 (వార్తాప్రభ):** ఓటర్ లిస్టులు, ఫామ్‌లు అనగానే చాలామందికి "అబ్బ.. ఆ గందరగోళం మాకొద్దు బాబోయ్" అనిపిస్తుంది కదూ? కానీ ఒక్క విషయం గుర్తుపెట్టుకోండి ప్రజాస్వామ్యంలో మీ గొంతుక మీ ఓటు. అందుకని అధికారుల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా, ఏ కన్ఫ్యూజన్ లేకుండా మ్యాటర్ చాలా సింపుల్‌గా, ఆధునిక శైలిలో ఇక్కడ స్పష్టంగా ఇచ్చేస్తున్నాం. ఒకసారి లుక్కేయండి!

మీ ఓటరు గుర్తింపు స్థితి: ఏ నిలువు వరుస (కాలమ్) ఏం చెబుతోంది?
ఓటరు జాబితాను పరిశీలించేటప్పుడు మీరు చూడాల్సిన ముఖ్యమైన సమాచారం ఇదిగో:

క్రమ సంఖ్య:
పోలింగ్ కేంద్రంలో మీ నంబర్ ఎంతో చెప్పే గుర్తింపు.

ఓటరు పేరు:
మీ పేరు అక్షర దోషాలు లేకుండా కరెక్ట్‌గా ఉందో లేదో చూసుకోవాలి.

తండ్రి/భర్త పేరు:
మీ కుటుంబ వివరాల నమోదు.

వయస్సు / లింగం:
మీ ప్రస్తుత వయస్సు సరిగ్గా నమోదయిందా లేదా?

పోలింగ్ కేంద్రం:
మీరు ఎక్కడికి వెళ్లి ఓటు వేయాలో చెప్పే చిరునామా.

ఓటరు కార్డు సంఖ్య (ఎపిక్ నంబర్):
మీ ఓటరు కార్డ్ పైన ఉండే ప్రత్యేక గుర్తింపు సంఖ్య.

ఒక్క నిమిషం.. పాత సమాచారం లేదా? అస్సలు దిగులు పడకండి!
గతంలో ఓటు ఉందో లేదో తెలియదు.. పాత సమాచారం వెతుక్కునే ఓపిక లేదు" అని దిగులు పడాల్సిన అవసరమే లేదు! ఒకవేళ మీ పాత సమాచారం అందుబాటులో లేకపోయినా, ఇప్పుడు సరికొత్తగా, డిజిటల్ పద్ధతిలో చాలా సులువుగా కొత్త ఓటు నమోదు (ఫామ్ 6 ద్వారా) చేసుకోవచ్చు. గతం గతః.. ఇప్పుడు మీ ఓటు హక్కును సాధించుకోవడమే ముఖ్యం!

**ఎస్ఐఆర్ ఫారం ఇలా నింపండి**
మీ ప్రాంత బీఎల్ఓ వద్ద లభించే ఫారమ్‌ను నింపేటప్పుడు కొత్త ఓటర్లు అయితే ఫారం-6ని, గతంలోనే ఓటు ఉండి మార్పులు లేదా బదిలీలు (మ్యాపింగ్) కావాలనుకునే వారు ఫారం-8ని ఎంచుకోవాలి; ముందుగా ఫారమ్‌పై మీ నియోజకవర్గం పేరు రాసి, నిర్దేశిత స్థలంలో కలర్ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను అతికించాలి. కొత్త ఓటర్లు తమ పేరు, ఇంటి నంబర్, పుట్టిన తేదీ మరియు మొబైల్ నంబర్‌ను స్పష్టంగా నింపుతూ, వాటికి మద్దతుగా ఆధార్ కార్డ్, వయస్సు మరియు నివాస ధృవీకరణ పత్రాల జిరాక్స్ ప్రతులను జత చేయాలి. గత ఓటర్లు తమ పాత నియోజకవర్గం లేదా పోలింగ్ బూత్ నుండి ప్రస్తుత నివాసానికి పూర్తి మ్యాపింగ్ (చిరునామా మార్పు) చేసుకోవడానికి, తమ పాత ఓటరు కార్డు (జూ×జ) సంఖ్యను ఫారమ్‌లో తప్పనిసరిగా నమోదు చేస్తూ, ప్రస్తుత నివాస రుజువును జతపరచాలి. కుటుంబంలోని మిగిలిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ బూత్ పరిధిలోకి వచ్చేలా (ఫ్యామిలీ మ్యాపింగ్ కోసం) ఫారమ్‌లోని సంబంధిత కాలమ్‌లో కుటుంబ సభ్యుల ఓటరు కార్డ్ నంబర్లను స్పష్టంగా రాయడం ఎంతో ముఖ్యం. చివరగా, గతంలో మరెక్కడా ఓటు లేదని లేదా పాత ఓటును బదిలీ చేస్తున్నామని నిర్ధారిస్తూ డిక్లరేషన్ కాలమ్‌లో తేదీ, స్థలం రాసి సంతకం చేసి బీఎల్ఓకి అందిస్తే, పాత-కొత్త ఓటర్ల పూర్తి మ్యాపింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తవుతుంది.




జాబితా శుద్ధీకరణ: తొలగింపులు దేనికి మాత్రమే?
ఓటర్ లిస్ట్ క్లీన్ చేయడం అంటే అర్హులైన వారిని తీసేయడం కాదు. కింది రెండు సందర్భాల్లో మాత్రమే ఓట్లు తొలగించబడతాయి:

రెండేసి ఓట్లు (డబుల్ ఓట్లు):
ఒకే వ్యక్తికి రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఓట్లు ఉంటే, ఒకటి మాత్రమే ఉంచి రెండోది తొలగిస్తారు.

మరణించిన వారి ఓట్లు:లి
అక్రమ ఓట్లను అరికట్టడానికి మరణించిన వారి వివరాలను జాబితా నుండి తొలగిస్తారు. కాబట్టి నిజాయితీ గల ఏ ఓటరు కూడా భయపడాల్సిన పనే లేదు. మీ ఓటు ఎక్కడికీ పోదు.

యువత, పౌరులారా..!!
ఇంకా ఆలస్యం ఎందుకు?
మీ ప్రాంతం అభివృద్ధి అవ్వాలన్నా, మీ సమస్యలపై ప్రశ్నించే హక్కు మీకు దక్కాలన్నా.. దానికి మొదటి మెట్టు మీ ఓటు. లి ఆఫీసుల చుట్టూ తిరిగే రోజులు పోయాయి, మీ స్మార్ట్‌ఫోన్ తీయండి. ఓటరు హెల్ప్‌లైన్ యాప్ లేదా జశీవతీం.వఱఅ.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్‌లోకి వెళ్ళండి. మీ పేరు ఉందో లేదో కేవలం 2 నిమిషాల్లో చెక్ చేసుకోండి. గుర్తుంచుకోండి ఓటు వేయకపోవడం అంటే మన భవిష్యత్తును వేరే వాళ్ల చేతుల్లో పెట్టడమే. బాధ్యత గల పౌరుడిగా ఇప్పుడే అలర్ట్ అవ్వండి.. మీ ఓటును భద్రం చేసుకోండి.

**గడ్డం సంతోష్ రాజ్**

వార్తా ప్రభ

# హైదరాబాద్

## ఓటరు సహాయ కేంద్రం పరిశీలన!!

- ఓటర్లకు ఇబ్బందులు వద్దు
- సేవలు వేగవంతం చేయండి
- సిబ్బందికి కమిషనర్ అరుణశ్రీ ఆదేశం



**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 17 (వార్తాప్రభ):** రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని 54వ డివిజన్ జవహర్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు సవరణ సహాయ కేంద్రాన్ని మున్సిపల్ ఇంచార్జి కమిషనర్ అరుణ శ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా సహాయ కేంద్రంలో అందిస్తున్న సేవల తీరును, ఓటర్లకు కల్పిస్తున్న సౌకర్యాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి రోజువారీగా ఎంతమంది ఓటర్లు వస్తున్నారు, ఎలాంటి సేవలు అందిస్తున్నారు, ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయి అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక నూతన ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా గత ఇరవై రోజులుగా నగర వ్యాప్తంగా ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్న నేపథ్యంలో, సహాయ కేంద్రం పాత్ర కీలకమని ఆమె తెలిపారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సత్వరమే సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. గణన పత్రాల పంపిణీ, వాటిని నింపడంలో తోడ్పాటు, ఆన్ లైన్ నమోదు ప్రక్రియ వేగవంతంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో తప్పుల సవరణకు వచ్చే వారికి పూర్తి అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రతి అర్హుడైన ఓటరు వివరాలు జాబితాలో నమోదయ్యేలా బాధ్యతగా పని చేయాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్, మున్సిపల్ అధికారులు, సహాయ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## మూసాపేట డిప్యూటీ కమిషనర్‌కు ఘన సన్మానం.. సేవలకు ప్రశంసల జల్లు!

**తెలంగాణ రాష్ట్ర ఓసి సంఘం ప్రధాన కార్యదర్శి వై. భాస్కర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కారం**



**కూకట్ పల్లి జూలై 17(వార్తా ప్రభ):** మూసాపేట సర్కిల్ మున్సిపల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ఓసి సంఘం ప్రధాన కార్యదర్శి వై. భాస్కర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రజలకు పారదర్శకంగా, బాధ్యతాయుతంగా సేవలందిస్తూ మున్సిపల్ పరిపాలనలో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వై. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిబద్ధతతో పనిచేస్తే ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందన్నారు. డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ మున్సిపల్ సేవలను మెరుగుపరిచేందుకు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సహకారంతో నగరాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా మరింత సమర్థవంతంగా సేవలందిస్తామని తెలిపారు. ఈ మర్యాదపూర్వక భేటీ ఆత్మీయ వాతావరణంలో సాగగా, పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో పలువురు ఓసి సంఘం నాయకులు, మున్సిపల్ అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్హులైన భూదాన్ లబ్ధిదారులకు స్థలం అందే వరకు వారి పక్షాన నిలబడతా..

**. టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్**



**కూకట్ పల్లి జూలై 17(వార్త ప్రభ):** నిరుపేదలు అర్హులైన భూదాన్ లబ్ధిదారులకు స్థలం అందే వరకు వారి పక్షాన నిలబడతానని 800 మంది లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూస్తానని టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్ హామీ ఇచ్చారు. దశాబ్దాలుగా పరిష్కారం దొరకని భూదాన్ ల్యాండ్ సమస్యకు సహాయం చేసి 800 మంది లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతూ బాధితులు టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ ని శుక్రవారం కలిసి అభ్యర్థించారు. మూసాపేట ఆంజనేయ నగర్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి వచ్చిన బాధితులు, పలువురు స్థానిక రాజకీయ నాయకులు ఐడిపియల్ ఉద్యోగుల అండతో సుమారు 17 ఎకరాల భూదాన్ భూమిని కబ్జా చేసి హక్కుదారులను బెదిరిస్తున్నారని, హైకోర్టు క్లియర్ డైరెషన్స్ ఉన్నప్పటికీ అధికారులు కూడా ఒత్తిళ్లకు లొంగి సమస్యపై దృష్టి పెట్టడం లేదని బాధితులు వాపోయారు. ఈ విషయంలో కల్పించుకొని న్యాయం చేయాలనీ బండిరమేష్ కి విజ్ఞప్తి చేసి వినతిపత్రం అందచేశారు. బాధితుల సమస్య పూర్వాపరాలు తెలుసుకున్న బండి రమేష్ వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్య తక్షణం పరిష్కరించేందుకు చొరవచూపాలని కోరారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు ఎలాంటి అక్రమాలకు, ఒత్తిడులకు లొంగినా పై అధికారులకు పిర్యాదు చేస్తానని బాధితులకు న్యాయం జరిగేదాకా వారి పక్షాన నిలబడతానని బండి రమేష్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ఖలీమ్ ఖాన్, ఫాల్గుణ రావు, చంద్రరావు, వాసు, నారాయణ, ఆంజనేయులు,రఘువీర్, మల్లికార్జున్, వాణి, కనకమ్మ, వజ్రం , భూదాన్ ల్యాండ్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## భారత్ కు అమెరికా బిగ్ షాక్

భారత్--అమెరికా వాణిజ్య, దౌత్య సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపే ఒక కీలక పరిణామం అమెరికా రాజకీయాల్లో చోటుచేసుకుంది. రష్యా నుంచి భారీగా ముడి చమురును దిగుమతి చేసుకుంటున్న దేశాలను కట్టడి చేయడమే లక్ష్యంగా అమెరికా సెనెట్‌లో "సాంక్షనింగ్ రష్యా యాక్ట్ 2026" బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లుకు ఇప్పటికే 60 మందికి పైగా యూఎస్ సెనేటర్లు మద్దతు తెలపడం అంతర్జాతీయంగా పెను సంచలనంగా మారింది. ఈ చట్టం గనుక ఆమోదం పొందితే.. రష్యా నుంచి అధికంగా చమురు కొనుగోలు చేసే దేశాల నుండి అమెరికాకు వచ్చే దిగుమతులపై 100 శాతం వరకు టారిఫ్‌లు విధించే అపరిమిత అధికారం అమెరికా అధ్యక్షుడికి లభిస్తుంది. రష్యా చమురుకు ప్రధాన కస్టమర్లలో ఒకటైన భారత్ పేరు కూడా ఈ జాబితాలో ఉండటం ఇప్పుడు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. బిల్లు ముఖ్య ఉద్దేశం ఏమిటి? ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యా ఆర్థిక వనరులను దెబ్బతీయడం.. చమురు ద్వారా ఆ దేశానికి వచ్చే ఆదాయాన్ని పూర్తిగా అడ్డుకోవడమే ఈ బిల్లు ప్రధాన వ్యూహం. రష్యా ఇంధన ఎగుమతుల ద్వారా లభించే ఆదాయం పరోక్షంగా ఉక్రెయిన్‌పై యుద్ధ కార్యకలాపాలకు నిధులుగా మారుతోందని అమెరికా గట్టిగా వాదిస్తోంది. ప్రస్తుతం రష్యా నుంచి అత్యధికంగా చమురు దిగుమతి చేసుకుంటున్న దేశాల జాబితాలు చూస్తే.. భారత్, చైనా, స్లోవేకియా, హంగేరీ, అజర్‌బైజాన్ ఈ దేశాల నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే వస్తువులపై 100 శాతం వరకు టారిఫ్‌లు విధించే అవకాశం ఉంది. అయితే ఏ దేశంపై ఎంత శాతం సుంకం విధించాలనే విషయాన్ని అమెరికా ట్రేడ్ రిప్రజెంటేటివ్ ప్రతి 180 రోజులకు ఒకసారి సమీక్షించి నిర్ణయం తీసుకుంటారు. గతంలో ఈ తరహా బిల్లులో ఏకంగా 500 శాతం టారిఫ్ ప్రతిపాదించినప్పటికీ తాజా ముసాయిదాలో దాన్ని 100 శాతానికి తగ్గించడం గమనార్హం. రష్యా చమురుపై భారత్ ఎందుకు ఆధారపడింది? ాాశ్రీంశీ =ఝుస - డబ్బులు ఊరకే ఖర్చు అయిపోతున్నాయా? ఎందుకో తెలిస్తే షాక్ అవుతారు! ఇటీవల మధ్యప్రాచ్యంలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు, హార్ముజ్ జలసంధిలో ఏర్పడిన అనిశ్చిత పరిస్థితుల కారణంగా అంతర్జాతీయంగా చమురు సరఫరాకు ఆటంకాలు ఏర్పడ్డాయి. ఈ తరుణంలో భారత్ తన ఇంధన భద్రత కోసం తక్కువ ధరలకే లభిస్తున్న రష్యా ముడి చమురుపై మరింతగా ఆధారపడాల్సి వచ్చింది. జూన్ నెలలో భారత్ రష్యా నుంచి దిగుమతి చేసుకున్న చమురు పరిమాణం గణనీయంగా పెరిగింది. ఇది దేశ మొత్తం చమురు దిగుమతుల్లో దాదాపు 34 శాతం వాటాను నమోదు చేసింది. సుమారు 4.5 బిలియన్ యూరోల విలువైన రష్యా చమురును భారత్ కొనుగోలు చేయడంతో.. చైనా తర్వాత రష్యాకు రెండో అతిపెద్ద చమురు కొనుగోలుదారుగా భారత్ నిలిచింది. భారత్‌కు దౌత్యపరమైన ఊరట ఉందా? భారత్-అమెరికా మధ్య ప్రస్తుతం ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలపై కీలక చర్చలు జరుగుతున్న సమయంలో ఈ బిల్లు రావడం పెద్ద సవాలుగా మారినప్పటికీ ఇందులో ఒక సానుకూల అంశం కూడా ఉంది. అమెరికా జాతీయ ప్రయోజనాలు లేదా వ్యూహాత్మక భాగస్వామ్యాల దృష్ట్యా అమెరికా అధ్యక్షుడికి అవసరమైతే కొన్ని దేశాలకు ప్రత్యేక మినహాయింపులు ఇచ్చే అధికారాన్ని కూడా ఈ బిల్లులో పొందుపరిచారు. అందువల్ల భారత్‌పై పూర్తిస్థాయిలో టారిఫ్‌లు అమలవుతాయా లేదా అన్నది భవిష్యత్తులో ఇరు దేశాల మధ్య జరిగే దౌత్యపరమైన చర్చలపైనే ఆధారపడి ఉంటుంది. ఈ బిల్లు ఆగస్టు నాటికి అమెరికా కాంగ్రెస్ ఆమోదం పొంది చట్టంగా మారితే భారత్-అమెరికా వాణిజ్య సంబంధాలు, దేశ ఇంధన దిగుమతుల వ్యూహం ఏ విధంగా మారుతాయనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం న్యూఢిల్లీ వర్గాలు ఈ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నాయి.

## వృద్ధురాలి హత్య కేసును ఛేదించిన వన్ టౌన్ పోలీసులు





**విజయవాడ పశ్చిమ జులై 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నగరంలోని వన్ టౌన్ పరిధిలో సంచలనం సృష్టించిన వృద్ధ మహిళ హత్య మరియు దొంగతనం కేసును పోలీసులు అత్యంత వేగంగా ఛేదించారు. కేసు నమోదైన కొద్ది గంటల్లోనే ముగ్గురు నిందితులను అరెస్టు చేయడమే కాకుండా, అపహరించబడిన 63 గ్రాముల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతురాలు కొత్తమాసు విజయలక్ష్మి (69) ఒంటరిగా నివసిస్తుండటాన్ని ఆసరాగా చేసుకుని ఈ దారుణానికి ఒడిగట్టారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు (ఏ1) మానేపల్లి సోమశేఖర్ మృతురాలికి దూరపు బంధువు కావడం గమనార్హం. బంధుత్వాన్ని అడ్డుపెట్టుకుని ఆమె ఒంటరిగా ఉంటున్న విషయాన్ని తెలుసుకున్న సోమశేఖర్, తన స్నేహితుడు నరేంద్ర మరియు తన సవతి కుమారుడైన ఒక మైనర్‌తో కలిసి ఈ హత్యకు ముందస్తు ప్రణాళిక వేశాడు. పథకం ప్రకారం ఆమె ఇంటికి వెళ్లి హత్య చేసి, ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు, సెల్ ఫోన్ దోచుకెళ్లారు. ఘటనపై సమాచారం అందిన వెంటనే వన్ టౌన్ పోలీసులు యుద్ధ ప్రాతిపదికన దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీమ్, ఫింగర్ ప్రింట్ నిపుణులు, మరియు సీసీటీవీ ఫుటేజీలను విశ్లేషించి నిందితులను గుర్తించారు. ఈ నెల 17వ తేదీ సాయంత్రం గుంటూరు జిల్లా నులకపేటలోని ఏ1 సోమశేఖర్ నివాసం వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 4 బంగారు గాజులు, ఒక నాంతాడు, చెవి దిద్దులు సహా మొత్తం 63 గ్రాముల బంగారం, మృతురాలి సెల్ ఫోన్ మరియు నేరానికి ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**నిందితుల వివరాలు:** మానేపల్లి సోమశేఖర్ (37) ప్రధాన నిందితుడు. ఇతనిపై గతంలో మూడు ఆస్తి సంబంధిత కేసులు ఉన్నాయి. బుద్ధబత్తుల నరేంద్ర (24) సోమశేఖర్ స్నేహితుడుజువెనైల్ (17): సోమశేఖర్ భార్య మొదటి భర్త కుమారుడుపశ్చిమ మండల డీసీపీ జి. రామకృష్ణ పర్యవేక్షణలో ఏసీపీ ఎన్. దుర్గారావు, వన్ టౌన్ ఎస్.హెచ్.ఓ బి. గుణరాము ,కొత్తపేట సి ఐ కొండలరావు, భవానిపురం సి ఐ ఉమామహేశ్వరరావు ఇతర స్టేషన్ల అధికారులు సమిష్టిగా కృషి చేసి ఈ కేసును ఛేదించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుని అత్యంత వేగంగా నిందితులను పట్టుకున్న పోలీసు బృందాన్ని విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు. ఇదే నిబద్ధతతో ప్రజలకు సేవలు అందించాలని ఆయన సూచించారు.

# అన్నమయ్య సంకీర్తనలతో పులకించిన విజయవాడ







**విజయవాడ పశ్చిమ జూలై 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా భారతీయ సంస్కృతి, కళలే మన గుర్తింపని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, కాకరపర్తి భావనారాయణ (కేబీఎన్) కళాశాల, అన్నమాచార్య భావన వాహిని సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ శోభారాజు పర్యవేక్షణలో నిర్వహించిన అన్నమాచార్య సంకీర్తనల శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి కేబీఎన్ కళాశాల కార్యదర్శి టి. శ్రీనివాసు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్నమయ్య వారసత్వాన్ని భావితరాలకు అందించడంలో డాక్టర్ శోభారాజు విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ పోడపాటి తేజస్విని మాట్లాడుతూ, సంగీతం మనిషిలో క్రమశిక్షణ, సహనం పెంపొందిస్తుందని, శోభారాజు అన్నమయ్య సంకీర్తనలను నిస్వార్థంగా యువతకు అందిస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నాయకత్వంలో కళలకు, కళాకారులకు ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. డాక్టర్ శోభారాజు మాట్లాడుతూ, అన్నమయ్య కీర్తనలను ప్రపంచవ్యాప్తంగా విస్తరించడమే తన జీవిత లక్ష్యమని పేర్కొన్నారు. అన్నమయ్య పాటల్లోని జీవన విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. కేబీఎన్ కళాశాల కార్యదర్శి టి. శ్రీనివాసు మాట్లాడుతూ, శోభారాజు గాత్రమాధుర్యం, భావవ్యక్తీకరణ విద్యార్థులను ఆధ్యాత్మిక అనుభూతికి గురిచేస్తాయని అన్నారు. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఆర్. మల్లిఖార్జునరావు రూపొందించిన అన్నమయ్య, శ్రీ వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని, కేబీఎన్ కళాశాల అధ్యాపకులు చలపతిరావు రచించిన "పద్యభారతి" గ్రంథాన్ని అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్కేపీవీవీ హిందూ హైస్కూల్ కమిటీ పరిపాలన అధికారి డాక్టర్ వి. నారాయణరావు, కేబీఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కార్యక్రమాలకు కేరాఫ్ అడ్రస్ గా కూటమి ప్రభుత్వం - ఎంపీ చిన్ని

**● తూర్పు నియోజకవర్గంలో 14 కోట్ల తో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ● త్వరలో కొండ ప్రాంతాలలో నివాసముంటున్న వారికీ ఇళ్ల పట్టాలు రెగ్యులరైజేషన్ ● విజయవాడ తూర్పు నియోజకవర్గం లోని 2,3,4,5 డివిజన్లలో రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేసిన ఎంపీ కేశినేని చిన్ని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్**





**విజయవాడ పశ్చిమ జులై 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ తూర్పు నియోజకవర్గం లోని 2,3,4,5 డివిజన్ల లో రోడ్డు పనులకు విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ మరియు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ కలిసి రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ ఈరోజు విజయవాడ తూర్పు నియోజకవర్గం లో 14 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని రోడ్లు వేసిన డ్రైనేజీ పనులు చేసిన ఇతర అభివృద్ధి పనులు ఏది చేయాలన్న ఆ పనులు జరగాలన్న ఒక్క తెలుగుదేశం మరియు కూటమి ప్రభుత్వంలోనేనని ఎంపీ చిన్ని అన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల విషయంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తో కలిసి ముఖ్యమంత్రి కార్యాలయమును ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి అభివృద్ధికి కావలసిన నిధులు మంజూరు చేసే విధంగా ఎప్పటికప్పుడు నిరంతర ప్రయత్నం చేస్తూనే ఉన్నామని తెలిపారు. కొండ ప్రాంతంలో ఉన్న ప్రజలకు త్వరలో గొప్ప శుభవార్త చెప్పబోతున్నామని కొండ ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలకు త్వరలో ఇళ్ల పట్టాలు రెగ్యులరైజ్ చేయబోతున్నామని దీని ద్వారా ఎంతోమంది కొండ ప్రాంత ప్రజలకు మేలు జరగబోతుందని వారి చిరకాల కోరిక తీర్చిన ప్రభుత్వంగా కూటమి సర్కార్ నిలుస్తుందని అన్నారు. నేడు రాయనపాడు రైల్వే స్టేషన్ కూడా అత్యంత వైభవోపేతంగా కూటమి ప్రభుత్వ సహాయ సహకారాలతో గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ యొక్క లక్ష్యంతో రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో రాయనపాడు రైల్వే స్టేషన్ అభివృద్ధి చేసినట్లు ఎంపీ తెలిపారు వచ్చే మార్చి లేదా ఏప్రిల్ నెలలో గుణదల రైల్వే స్టేషన్ ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభించుకుంటామని తెలిపారు త్వరలో రెండు ఆర్వో బీ లు కూడా ప్రారంభిస్తున్నామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విజయవాడ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నాయని,పదవిని అనుభవించిన నాయకులు ఈ తూర్పు నియోజకవర్గ ప్రాంతంలో చాలామంది ఉన్న వారు ఎవరు ఈ ప్రాంతం అభివృద్ధిని పట్టించుకోలేదని అన్నారు విజయవాడ ప్రాంతం అనగానే అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు అభివృద్ధిలో ముందుండి నడిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు .ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, హైకోర్టు అడ్వకేట్ లీగల్ సెల్ నాయకులు ఎర్నేని వేదవ్యాస్, దేవానంద్, ముమ్మినేని ప్రసాద్, స్థానిక డివిజన్ అధ్యక్షుడు గాబ్రియల్, బచ్చులకూరి అజయ్ కుమార్, సుగసాని రత్న శ్రీకృష్ణ ప్రసాద్ బాబురావు, నర్రా సుబ్బారావు, శ్యాం ప్రసాద్ నాగభూషణం, కిషోర్, షరీఫ్ ఆంజనేయులు, భీమేశ్వరరావు, వంశీకృష్ణ, పూర్ణ, సుధాకర్ కొండ,నాగ శేషు, నాగూర్, దిలీప్,గణేష్ నాగ దుర్గ, తదితరులు పాల్గొన్నారు...

# ఎస్సీ,ఎస్టీ పారిశ్రామికవేత్తలపొట్టగొడుతున్న బాబుసర్కార్ - కామరాజ్ హరీష్



**విజయవాడ పశ్చిమ జులై 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**?కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో దళిత,గిరిజన వర్గాల పట్ల చంద్రబాబు నాయుడు నిజస్వరూపం మరోసారి బయటపడిందని వైస్సార్సీపీ ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి కామరాజ్ హరీష్ కుమార్ తీవ్రంగా మండిపడ్డారు. ఎన్నికల సమయంలో మాటలు మాణిక్యాలు చెప్పూ,దళిత యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని ఇచ్చిన హామీలు నేడు పూర్తిగా చేతలు శూన్యం గా మారాయని ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8,500 మంది ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన దాదాపు రూ.780 కోట్ల ఇన్సెంటివ్‌లు,సబ్సిడీ బకాయిలను రెండేళ్లుగా నిలిపివేసి,వారిని నట్టేట ముంచారని ఆరోపించారు. ప్రభుత్వ మొండివైఖరి వల్ల బ్యాంకు రుణాలు చెల్లించలేక,పరిశ్రమలు నడపలేక రోడ్డున పడ్డ దళిత పారిశ్రామికవేత్తలు గుంటూరు జిల్లా చినకాకానిలో 16 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా,అర్ధనగ్న ప్రదర్శనలతో తమ ఆవేదనను చాటుకుంటున్నా ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేకపోవడం దుర్మార్గమన్నారు.?ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని కలిసి మొరపెట్టుకున్నా హామీలకే పరిమితమయ్యారు తప్ప,ఆచరణలో పైసా విదిల్చలేదని విమర్శించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న పారిశ్రామికవేత్తలపై పోలీస్ యాక్ట్-30 పేరుతో ఆంక్షలు విధించడం,పోలీసులను ప్రయోగించి ఉద్యమాలను అణచివేయాలని చూడడం చంద్రబాబు నిరంకుశ పాలనకు అద్దం పడుతోందన్నారు. గతంలోనూ ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించి,దళిత సంక్షేమ పథకాలను గాలికి వదిలేసిన చరిత్ర చంద్రబాబుదని,ఇప్పుడు మళ్లీ అదే మోసాన్ని పునరావృతం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల ముందు దళితులకు పెద్దపీట వేస్తామని చెప్పి,గద్దెనెక్కిన తర్వాత వారి పొట్టగొడుతున్న చంద్రబాబు ప్రభుత్వం తక్షణమే స్పందించి,ఎస్సీ,ఎస్టీ పారిశ్రామికవేత్తల రూ.780 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని,లేనిపక్షంలో వైస్సార్సీపీ తరఫున బాధితులకు అండగా నిలిచి పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని కామరాజ్ హరీష్ కుమార్ హెచ్చరించారు.

# సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్‌లక్ష్యం

**విజయవాడ పశ్చిమ జులై 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజా సమస్యలు నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని 40 వ డివిజన్ టీడీపీ, బీజేపీ అధ్యక్షులు పీవీ చిన సుబ్బయ్య, నక్కిట్ల రాజా అన్నారు..ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, కూటమి నేతలతో కలిసి భవానిపురం ఎన్డీయే కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు..ప్రజలు వివిధ సమస్యలపై వినతులు సమర్పించారు.. వచ్చిన అర్జీలను స్వయంగా పరిశీలించి అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్ లో మాట్లాడి సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. రాజకీయాలకతీతంగా , ప్రజాసేవే ధ్యేయంగా ప్రజా సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కరిస్తున్నామని 40 వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పీవీ చిన సుబ్బయ్య, బీజేపీ అధ్యక్షుడు నక్కిట్ల రాజా అన్నారు. మాజీ కార్పొరేటర్ పైడిమాల సుభాషిణి,కూటమి నేతలు కామ దేవరాజ్, కొప్పుల గంగాధర్, పోతిన భేసు కంఠేశ్వరుడు బొల్లేపల్లి



కోటేశ్వరరావు, బొడ్డుపల్లి శ్రీనివాసరావు, పట్నాల హరిబాబు తదితరులు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు..

## మొబైల్ కోర్టులో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానా



**విజయవాడ పశ్చిమ జులై 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరపాలక సంస్థ నగరంలో పారిశుధ్యం, ప్రజారోగ్య పరిరక్షణకు విఘాతం కలిగించే చర్యలపై కఠిన చర్యలు కొనసాగిస్తోంది. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రజారోగ్య విభాగం అధికారులు శుక్రవారం సర్కిల్-1 కార్యాలయంలో సంచార న్యాయస్థానం (మొబైల్ కోర్టు) నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజారోగ్య విభాగం అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి, రహదారులపై చెత్తాచెదారం వేయడం, రోడ్లపై పశువులు మరియు పెంపుడు కుక్కలను విచ్చలవిడిగా వదిలేయడం, కాలువల్లో వ్యర్థాలు వేయడం ద్వారా మురుగునీటి పారుదలకు ఆటంకం కలిగించడం, డి అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించడం వంటి ఉల్లంఘనలకు పాల్పడిన వారిని గుర్తించారు. ఈ ఉల్లంఘనలకు సంబంధించి మొత్తం 22 కేసులు నమోదు చేసి నిందితులను మొబైల్ కోర్టులో జడ్జి టి.ఎ.ఎస్.ఎస్.ఆర్.ఎ. రిషిక్ ఎదుట హాజరుపరిచారు. కేసులను విచారించిన జడ్జి నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించగా, మొత్తం రూ.5,780 జరిమానా వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రజారోగ్యానికి హాని కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు. రహదారులు, కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా, నిబంధనలను పాటించి నగర పరిశుభ్రతకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భవిష్యత్తులో కూడా మొబైల్ కోర్టుల ద్వారా కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, శానిటరీ సూపర్వైజర్లు డి. సోమరాజు, ఎస్.వి.ఎస్. శ్రీధర్, శానిటరీ ఇన్స్పెక్టర్లు మరియు ప్రజారోగ్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజారోగ్యమే ప్రథమం.. మటన్, చేపల మార్కెట్ల తరలింపునకు కలెక్టర్ ఆదేశం



**తిరుపతి, జూలై 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రజారోగ్యానికి భంగం కలగకుండా వ్యాపారాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందికరంగా మారిన మటన్, చేపల మార్కెట్లను ప్రత్యామ్నాయ ప్రాంతాలకు తరలించాలని నిర్ణయించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ శారదాదేవి, ఆర్డీఓ రామ్మోహన్, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్, వెటర్నరీ, ఫుడ్ కంట్రోల్, ఫిషరీస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లీలామహల్ సమీపంలోని చేపల మార్కెట్ వల్ల ట్రాఫిక్ సమస్యలు, దుర్వాసన, పరిసర ప్రాంత ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని, పెద్దపీర్ల చావిడిలోని మటన్ మార్కెట్ వల్ల పరిశుభ్రత లోపించి ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని తెలిపారు. ఆంత్రాక్స్ వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. దీంతో పెద్దపీర్ల చావిడిలోని మటన్ మార్కెట్‌ను వైకుంఠపురం రోడ్డులోని నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్‌కు, లీలామహల్ చేపల మార్కెట్‌ను ఎంఆర్‌పల్లె న్యూ బాలాజీ కాలనీలోని మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌కు వెంటనే తరలించాలని నిర్ణయించారు. అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అలిపిరి జూపార్క్ రోడ్డులో తొలగించిన వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా ఇస్కాన్ రోడ్డు--చెన్నారెడ్డి కాలనీ మధ్యనున్న అభయ చరణారవింద భక్తివేదాంత స్వామి ప్రభుపాదుల మార్గం, అలాగే చింతలచేను సమీపంలోని కులశేఖర్ ఆల్వార్ వంద అడుగుల రోడ్డులో వ్యాపారాలు కొనసాగించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు తీసుకుంటున్న చర్యలకు వ్యాపారులు సహకరించాలని, పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహార పదార్థాలను విక్రయిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

**ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్**



**ఇబ్రహీంపట్నం, జులై 17(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని మైలవరం శాసన సభ్యుడు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ హామీ ఇచ్చారు. ఉద్యోగుల సమస్యలను ప్రజాప్రతినిధులకు వివరించే కార్యక్రమంలో భాగంగా ఏపీపీటీడీ ఇబ్రహీంపట్నం డిపో జేఏసీ ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యే వసంతను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణకు సంబంధించిన అంశాలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. అవసరమైతే ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దల వద్దకు జేఏసీ నాయకులను స్వయంగా తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్, ఎంప్లాయీస్ అసోసియేషన్, కార్మిక పరిషత్ నాయకులు పాల్గొన్నారు.

## ఇదే కదా ఉన్నతము



యథార్థమైన ప్రవర్తన
ఖచ్చితమైన పరివర్తన
భగవంతునికి బహు ఇష్టము
దొరుకుతుంది దైవ దీవెన
అభాగ్యుల బ్రతుకుల్లో
ఆనందం నింపడము
అదే కదా గొప్పతనము
ఆదర్శం చూపడము
పదిమంది హృదయాల్లో
స్థానం సంపాదించడము
మనసును నియంత్రించడము
అదేకదా విజయోత్సవము
ఆపదలో సాయపడడము
మానవత్వం చాటడము
ఇదే కదా మహోన్నతము
పెద్దలను గౌరవించడము

**-గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు, సెల్ :9966414580

# ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి దోమల వల్ల కలిగే వ్యాధులను నిర్మూలిద్దాం





**విజయవాడ పశ్చిమ జులై 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరంలో దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులను సమర్థవంతంగా నివారించేందుకు ప్రతి ఇంటిలో ప్రతి శుక్రవారం డ్రై డేను తప్పనిసరిగా పాటించాలని విజయవాడ నగరపాలక సంస్థ బయాలజిస్ట్ సూర్యకుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం గిరిపురం పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు దోమల నివారణపై సూచనలు అందించారు. ఈ సందర్భంగా బయాలజిస్ట్ సూర్యకుమార్ మాట్లాడుతూ నగరంలో దోమల ఉత్పత్తిని అరికట్టేందుకు విజయవాడ నగరపాలక సంస్థ శాస్త్రీయ పద్ధతుల్లో విస్తృత చర్యలు చేపడుతోందన్నారు. ప్రధాన కాలువల్లో పూడిక తొలగింపు చేపట్టి ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా నిరంతర చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ట్రాక్టర్ ఆధారిత ప్రత్యేక యంత్రాలు, బోట్ల సహాయంతో కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్కలు, చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలను తొలగిస్తున్నామని చెప్పారు. సిబ్బంది చేరుకోలేని ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేసి దోమల లార్వా పెరగకుండా నివారణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అదేవిధంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిరంతరం ఫాగింగ్, యాంటీ లార్వల్ స్ప్రేయింగ్ నిర్వహించడంతో పాటు, దోమల లార్వాను ఆహారంగా తీసుకునే గాంబూసియా చేపలను నీటి వనరుల్లో విడిచిపెట్టి జీవసంబంధిత పద్ధతులను కూడా అమలు చేస్తున్నామని వివరించారు. నగరపాలక సంస్థ చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో వారానికి ఒకరోజు, ముఖ్యంగా ప్రతి శుక్రవారం 'డ్రై డే'గా పాటించి, ఇంటి లోపల, బయట, డాబాపై మరియు పరిసర ప్రాంతాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. వాడుకలో లేని బకెట్లు, మగ్గులు, తొట్లు, డ్రమ్ములు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, టైర్లు, కూలర్లు, ఫ్రిజ్ ట్రేలు, నీటి నిల్వ ఉండే ఇతర పాత్రలను ప్రతి శుక్రవారం తప్పనిసరిగా పరిశీలించి వాటిలోని నీటిని పూర్తిగా పారబోయాలని సూచించారు. కేవలం ఐదు నుంచి ఏడు రోజుల పాటు నిల్వ ఉన్న నీటిలోనే దోమల లార్వా వేగంగా అభివృద్ధి చెందుతుందని, అందువల్ల వారానికి ఒకసారి నీటి నిల్వలను తొలగించడం ద్వారా దోమల ఉత్పత్తిని గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా అధికారులు ఇంటింటికీ వెళ్లి నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి ప్రజలకు ప్రత్యక్షంగా చూపిస్తూ, వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం ద్వారా దోమల వ్యాప్తిని శాశ్వతంగా నియంత్రించవచ్చని వివరించారు. పరిశుభ్రమైన పరిసరాలు, ప్రజల అప్రమత్తత, నగరపాలక సంస్థ చర్యలు కలిసివస్తేనే దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను పూర్తిగా నియంత్రించగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ (ఇన్‌చార్జ్) గోపాల్ నాయక్, జోనల్ కమిషనర్--II కె. ప్రభుదాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ బి. కోటేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మలేరియా విభాగం సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# ట్రీ గార్డుల అందజేత.

**మైత్రి ఫౌండేషన్ వితరణ.**



**మచిలీపట్నం జూలై 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గత నెల పిల్లారిశెట్టి పాలెం గ్రామంలో నాటిన మొక్కలను సంరక్షించే లక్ష్యంతో, మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 15,000/- రూపాయల విలువైన ట్రీ గార్డులను గురువారం అందజేశారు. గ్రామ యువత అభ్యర్థన మేరకు మొక్కల రక్షణ కోసం ఏర్పాటు చేసిన ట్రీ గార్డులను మైత్రి ఫౌండేషన్ ప్రతినిధులు గ్రామ పెద్దల సమక్షంలో అందజేశారు. మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ఫౌండేషన్ ముందుకు రావడం అభినందనీయమని గ్రామస్తులు కొనియాడారు. మైత్రి ఫౌండేషన్ అధ్యక్షులు కేసాని వేణు కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉందని ఈ పరిస్థితులను అధిగమించి ప్రకృతి సమతుల్యతను పునరుద్ధరించాలంటే ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని పిలుపు నిచ్చారు. మొక్కను నాటడం ప్రకృతికి ఇచ్చే కానుక అయితే, దానిని కాపాడటం భావితరాలకు అందించే వరం అన్నారు. పచ్చని చెట్లు ప్రగతికి మెట్టు అన్నారు. వర్షపాతం మెరుగుపడి భూగర్భ జలాలు పెరుగుతాయి. పర్యావరణ పరిరక్షణ అనేది ప్రభుత్వం బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అన్నారు. ప్రతి మొక్క కాబోయే తరానికి జీవనాధారంగా నిలుస్తుందన్నారు. గౌరవ అధ్యక్షులు వరప్రసాద్, ఉపాధ్యక్షులు ప్రసాద్, రమాదేవి, టి.మాణిక్యరావు, గ్రామ పెద్దలు గణపతి, కె. రాంబాబు, జెవివి సుబ్బారావు, ఎం. వెంకటేశ్వరరావు, కె.వి నాగేశ్వరరావు, కె. సీతారాముడు, పి. కామేశ్వరరావు, కె.దుర్గారావులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన గ్రామస్తులు అందరికీ ఫౌండేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

## మద్యం మత్తు... క్షణికావేశం... కుమారుడి ప్రాణం బలి.

**మంగినపూడి బొట్లవానిగూడెంలో దారుణం..**

**తండ్రి దాడిలో యువకుడు మృతి.**



**మచిలీపట్నం జూలై 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలం మంగినపూడి బొట్లవానిగూడెంలో గురువారం రాత్రి చోటుచేసుకున్న విషాద ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మద్యం మత్తులో ఉన్న తండ్రి క్షణికావేశంలో కర్రతో దాడి చేయడంతో కుమారుడు మృతి చెందిన ఘటన అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, రామ్మోహన్ రావు కుటుంబంలో భార్య, కుమారుడు కళ్యాణ చక్రవర్తి (30) మధ్య స్వల్ప వివాదం జరిగింది. వారిద్దరినీ సముదాయించే క్రమంలో అప్పటికే మద్యం మత్తులో ఉన్న రామ్మోహన్ రావు ఆవేశానికి లోనై తన వద్ద ఉన్న కర్రతో కుమారుడిపై బలంగా దాడి చేశాడు. దాడిలో కళ్యాణ చక్రవర్తికి తీవ్ర గాయమై అధిక రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిందితుడు రామ్మోహన్ రావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మద్యం మత్తు, క్షణికావేశం కలిస్తే కుటుంబాలే ఛిన్నాభిన్నమవుతాయని ఈ ఘటన మరోసారి గుర్తు చేసింది. చిన్న చిన్న కుటుంబ విభేదాలను సంయమనంతో, సంభాషణ ద్వారా పరిష్కరించుకోవాల్సిన అవసరాన్ని ఈ విషాదం చాటిచెబుతోంది.

## ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ పై విద్యార్థులకు అవగాహన.

**మచిలీపట్నం జూలై 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విద్యార్థులు ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి, యు .వి .సుబ్బారావు అన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మచిలీపట్నం లోని 4 పాఠశాలలలో విద్యార్థులకు ప్రముఖ ఎన్నారై శ్రద్ధ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ పై విద్యార్థులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. చిలకలపూడి మున్సిపల్ పాండురంగ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ పై ప్రముఖ ఎన్నారై, శ్రద్ధ అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రద్ధ రచించిన ఎర్లీ బర్న్ పుస్తకాన్ని డిఇఓ ,యు.వి. సుబ్బారావు, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్, గొర్రెపాటి గోపీచంద్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఉపాధ్యక్షుడు, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్, మానవతా జిల్లా కో కన్వీనర్, ముదిగొండ శాస్త్రి, సమగ్ర శిక్ష ఎఎంఒ, రెడ్ రోతు శ్యాంసుందర్ లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఇఓ, యు. వి. సుబ్బారావు మాట్లాడుతూ రానున్న కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ సమాజాన్ని ఏలే కాలం వచ్చింది అన్నారు. ఇప్పటికే ఉపాధ్యాయులకు ఆన్లైన్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ పై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాము అన్నారు. కాలిఫోర్నియాకు చెందిన శ్రద్ధ మచిలీపట్నం వచ్చి నాలుగు పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ పై అవగాహన సదస్సులు నిర్వహించడం ముదా వాహం అన్నారు. త్వరలో పాఠశాలల విద్యార్థుల కు తల్లుల ఎకౌంట్లో తల్లికి వందనం సొమ్ము జమవుతుంది అన్నారు. కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యారంగంలో గణనీయమైన మార్పులు చేకూరుతున్నాయని దీనివల్ల విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోగలుగుతారు అన్నారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానంపై అప్డేట్ కావాలన్నారు. ప్రముఖ ఎన్నారై శ్రద్ధ పిలవంగానే అమెరికా నుంచి మచిలీపట్నం వచ్చి మన మచిలీపట్నంలో పాఠశాలల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై అవగాహన కల్పించడం ఎంతో ఆనందదాయకం అన్నారు. మచిలీపట్నం రుస్తుం బాధ బాలికల ఉన్నత పాఠశాల లో తొలుత హై స్కూల్ విద్యార్థులు, ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థుల కు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతుల్లో టిడిపి నాయకు లు, పి. వి. ఫణి కుమార్, మంచాల రాంబాబు, ఆర్ పేట ఎస్ఐ, లోకేశ్వరి, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కో కన్వీనర్ ముదిగొండ శాస్త్రి, ప్రధానోపాధ్యాయురాలు, ఇందిరా మాట్లాడారు. అనంతరం సన్ స్టార్ స్కూల్లో మానవతా సమస్త అధ్యక్షుడు బి అయ్యప్ప స్వామి ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ పై అవగాహన సదస్సు నిర్వహించారు. బాలాజీ విద్యాలయంలో జరిగిన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ అవగాహన సదస్సులో ప్రముఖ ఎన్నారై, శ్రద్ధ మాట్లాడుతూ విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కొమరగిరి చంద్రశేఖర్, మానవతా డైరెక్టర్, కారుమూరి రాజేంద్రప్రసాద్, తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రముఖ ఎన్నారై, శ్రద్ధను ఆమె తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు.

## మర్రిపాడు మండల అధ్యక్షులుగా ఆర్ల శ్రీనివాసులు నియామకం



**ఆత్మకూరు జూలై 17 (వార్తాప్రభ)** ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు కొప్పాల రఘు మర్రిపాడు మండల కమిటీ అధ్యక్షులుగా ఆర్ల శ్రీనివాసులును నియమించారు. ఈ సందర్భంగా కమిటీ రాష్ట్ర అధ్యక్షులు కొప్పాల రఘు మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ సామాజిక న్యాయం ఎస్సీ ఎస్టీ వర్గాల హక్కుల సాధన కోసం కమిటీని గ్రామ స్థాయి వరకు విస్తరించే దిశగా కమిటీ ముందుకు సాగుతోందన్నారు. మర్రిపాడు మండలంలో ప్రజా సమస్యల పరిష్కారం చట్టాలపై అవగాహన కల్పించడం బాధితులకు న్యాయం అందించడంలో ఆర్ల శ్రీనివాసులు సమర్థవంతంగా పనిచేస్తారనే నమ్మకం వ్యక్తం చేశారు. నూతనంగాబాధ్యతలు స్వీకరించిన ఆర్ల శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు కొప్పాల రఘు తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని రాజ్యాంగ స్ఫూర్తితో ప్రతి గ్రామంలో కమిటీని బలోపేతం చేస్తూ ఎస్సీ ఎస్టీ వర్గాల హక్కుల పరిరక్షణకు అంకితభావంతో సేవలందిస్తానని తెలిపారు.

# క్వాంటం టెక్నాలజీల భవిష్యత్‌పై ఎస్వీసీఈలో జాతీయ సదస్సు





**తిరుపతి, జూలై 17 :(వార్తా ప్రభ ప్రతినిధి):** తిరుపతిలోని కరకంబాడి రోడ్డులో ఉన్న ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల (ఎస్వీసీఈ) గణిత విభాగం ఆధ్వర్యంలో సెర్బ్--ఏఎన్ఆర్ఎఫ్ ప్రాయోజకత్వంలో "మ్యాథమెటికల్ ఫౌండేషన్స్ ఆఫ్ క్వాంటం టెక్నాలజీస్: ఫ్రమ్ థియరీ టు అప్లికేషన్స్" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరగనున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి డాక్టర్ ఎస్. విశ్వనాథరాజు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చంద్రశేఖర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథి డాక్టర్ ఎస్. విశ్వనాథరాజు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న క్వాంటం టెక్నాలజీ రంగంపై విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులకు సమగ్ర అవగాహన కల్పించడం, అలాగే ఇంజినీరింగ్, సైన్స్, కృత్రిమ మేధస్సు (ఏఐ), క్వాంటం కంప్యూటింగ్ వంటి రంగాల్లోని అనువర్తనాలను పరిచయం చేయడం ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమని తెలిపారు. నూతన యుగంలో క్వాంటం టెక్నాలజీల అవసరం, ప్రాధాన్యతను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ క్వాంటం రంగంలోని అత్యాధునిక పరిశోధనలపై ప్రముఖ విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, పరిశోధకులతో ప్రత్యక్షంగా సంభాషించే అవకాశాన్ని కల్పించడం ద్వారా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసి వారి నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని పేర్కొన్నారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ ఆర్. విజయలక్ష్మి స్వాగతోపన్యాసం చేశారు. ప్రోగ్రామ్ కన్వీనర్, గణిత విభాగాధిపతి డాక్టర్ కె. వెంకటేశ్వరరాజు మాట్లాడుతూ గణితశాస్త్రంలో చోటుచేసుకుంటున్న విప్లవాత్మక మార్పులను అర్థం చేసుకోవడానికి ఈ సదస్సు చక్కని వేదికగా నిలుస్తుందని తెలిపారు. విద్యార్థులలో పరిశోధనాసక్తి, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇటువంటి జాతీయ సదస్సులు ఎంతో ఉపయోగకరమని అన్నారు. సదస్సులో డాక్టర్ దాదామియా, డాక్టర్ ఏ ఎం డి షేక్, డాక్టర్ ఎన్. ఉదయ్ కిరణ్, డాక్టర్ రాజాదాస్ తదితర ప్రముఖులు క్వాంటం టెక్నాలజీలపై విశ్లేషణాత్మక ప్రసంగాలు చేశారు. వివిధ కళాశాలల విద్యార్థులు, జేఎన్‌టీయూఏ అనుబంధ పరిశోధన కళాశాలల అధ్యాపకులు, పరిశోధకులు, ఎస్వీసీఈ గణిత విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేశారు.

## విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ





**చేజర్ల జూలై 17 (వార్తాప్రభ)** చేజర్ల గ్రామపంచాయతీలోనీ ఎస్సీ కాలనీ నందు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు అవసరమైన విద్యా సామాగ్రిని మాజీ పంచాయతీ వార్డు సభ్యురాలు సోమవరపు సంగీత అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడచిన 6 సంవత్సరాలు నుండి మా ఊరి పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు అవసరమైన విద్యాసామాగ్రిని అందిస్తూ రావడం చాలా సంతోషకరమని ప్రతి సంవత్సరం ఇలానే పాఠశాల విద్యార్థులకు విద్యా సామాగ్రిని అందజేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణారెడ్డి మండల టిడిపి పార్టీ ఎస్సి సెల్ అధ్యక్షులు సోమవరపు హజరత్తయ్య పాఠశాల చైర్మన్ గంగపట్ల లక్ష్మయ్య కాలనీవాసులు అర్జున్ కుమార్ వెంకట కృష్ణయ్య బాబు పాల్గొన్నారు.

## ప్రిన్సిపల్ హెల్త్ సెక్రటరీ ని కలిసిన గ్రామీణ వైద్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు.



**మచిలీపట్నం జూలై 17 :(వార్తా ప్రభ ప్రతినిధి):**గ్రామీణ వైద్య సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బి.ఆర్ ఆంజనేయులు రాష్ట్ర ప్రిన్సిపల్ హెల్త్ సెక్రటరీ ఫ్యామిలీ వెల్ఫేర్ వారిని పదవీ బాధ్యతలు స్వీకరించిన జి వీర పాండ్యన్ ను రాష్ట్ర సెక్రటేరియట్లోని వారి చాంబర్లో కలిసి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. వారిని దుస్సాలువాతో సత్కరించారు. రాష్ట్ర గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారం కొరకు కృషి చేయాలని వినతిపత్రం అందజేశారు.

## మండల విద్యాశాఖ అధికారులతో డీఈఓ సమావేశం.



**మచిలీపట్నం జూలై 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి యు.వి. సుబ్బారావు ఉమ్మడి కృష్ణా జిల్లాలోని అన్ని మండల విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన జిల్లాల విభజన ప్రక్రియలో భాగంగా ఉపాధ్యాయుల జాబితాల రూపకల్పన, వివరాల నమోదు పరిశీలన అంశాలపై మండల విద్యాశాఖ అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్లకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయుల సేవా వివరాలను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఎటువంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని, ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఖచ్చితత్వాన్ని నిర్ధారించాలని సూచించారు. అలాగే, ఈ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి సంబంధిత అధికారులకు నివేదికలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖ అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# సూరారంలో ఓటరు నమోదుపై కోల రవీందర్ ముదిరాజ్ వినూత్న ప్రచారం


- సొంతంగా బట్టపై రాసిన బ్యానర్లు, మైకు రికార్డింగులతో ప్రజా చైతన్యం
- ఓటు నమోదు చేసుకోవాలని ప్రజలకు, పాఠశాల విద్యార్థులకు అవగాహన





**సూరారం, జూలై 17, (వార్తాప్రభ) :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియపై సూరారంలో సామాజిక, పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో వినూత్న ప్రచార కార్యక్రమం నిర్వహించబడింది. సూరారం కాలనీలోని ప్రధాన బస్ స్టాప్, ఫస్ట్ హోమ్ జెండా, సెకండ్ హోమ్ జెండా మరియు సూరారం ఎక్స్ రోడ్ ప్రాంతాలలో ప్రజలకు ఓటు హక్కు ప్రాధాన్యతపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ ప్రచారంలో కోల రవీందర్ ముదిరాజ్ స్వయంగా తన చేతులతో కాటన్ బట్టపై స్కెచ్ పెన్నులతో ఓటరు అవగాహన నినాదాలు రాసి బ్యానర్లను సిద్ధం చేశారు. అలాగే సొంతంగా మైకు ద్వారా సమాచారాన్ని రికార్డు చేసి, చౌరస్తాలలో వినిపిస్తూ ప్రజల వద్దకు నేరుగా వెళ్లి ఎడ్యుకేట్ చేశారు. భవిష్యత్తులో ఓటును ఆధార్ కార్డుతో అనుసంధానం (లింక్) చేసే అవకాశాలు ఉన్నాయని, కాబట్టి ముందే జాగ్రత్తపడి ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. కొత్తగా 18 ఏళ్లు నిండిన వారు మీసేవ కేంద్రాల ద్వారా కానీ, ఇంట్లో స్మార్ట్ ఫోన్ ఉన్నట్లయితే పిల్లల సహాయంతో ఆన్లైన్ ద్వారా కానీ సులభంగా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఈ వినూత్న ప్రచారాన్ని చూసి ఆకర్షితులైన స్థానికులు తమ మొబైల్ ఫోన్లలో దృశ్యాలను బంధించి ఇతరులకు పంపడం విశేషం. బస్తీలలో నిర్వహించిన ర్యాలీతో పాటు పాఠశాల విద్యార్థులకు కూడా ఈ ఓటరు సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ ఇళ్లకు వెళ్లాక తల్లిదండ్రులకు, అన్నదమ్ములకు మరియు పొరుగువారికి ఓటు నమోదు ప్రాధాన్యతను వివరించి చెప్పాలని కోల రవీందర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. ఈ వినూత్న అవగాహన ర్యాలీ మరియు ప్రచార కార్యక్రమంలో 60 గజాల శ్యామ్, గుట్ట అశోక్, ఆర్. లక్ష్మీనారాయణ, జి. రమేష్, రాజు, ఆంజనేయులు, దేవి రెడ్డిలతో పాటు పలువురు వృద్ధులు, యువకులు మరియు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లుంబిని విద్యార్థి హేమతేజకు షైనింగ్ స్టార్ అవార్డు



**చేజర్ల జూలై 17 (వార్తాప్రభ)** చేజర్ల మండలంలోని బోడిపాడు కేంద్రంలో ఉన్న లుంబిని ప్రైవేట్ పాఠశాల విద్యార్థి యు. హేమతేజ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి సైనింగ్ స్టార్ అవార్డు సాధించాడు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతి ఏటా షైనింగ్ స్టార్ అవార్డులను అందజేస్తుంది. ఇదే క్రమంలో ఆంధ్రప్రదేశ్ కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వారు ఈ విద్యార్థి 600 మార్కులకు గాను 594 మార్కులు సాధించడంతో ఈ అవార్డును ప్రకటించడం జరిగినది. ఈ సందర్భంగా లుంబిని పాఠశాల యాజమాన్యం మరియు ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేయడం జరిగినది.

## రోడ్డు విస్తరణ పనులలో బాధితులకు ఎలాంటి అన్యాయం లేకుండా చర్యలు తీసుకుంటాం

**- శాసనసభ్యులు అరికపూడి గాంధీ**



**శేరిలింగంపల్లి,జూలై 17 (వార్తాప్రభ):** శేరిలింగంపల్లి నియోజకవర్గం గంగారం గ్రామంలో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనుల్లో బాధితులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ గౌడ్ హామీ ఇచ్చారు. శుక్రవారం గంగారం గ్రామంలో రోడ్డు విస్తరణపై బాధిత కుటుంబాలు, గ్రామ పెద్దలతో సమావేశమై వారి సమస్యలను విన్నారు. అభివృద్ధితో పాటు ప్రజల హక్కులు కూడా పరిరక్షించేలా అధికారులతో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో ఎ-6 నిందితుడు బెటాలియన్ కానిస్టేబుల్ వెంకటేష్ అరెస్ట్



**భద్రాద్రి కొత్తగూడెం జూలై 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** డీఎస్పీ కార్యాలయం, కొత్తగూడెం 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై లైంగిక దాడికి సంబంధించిన కేసులో ఎ-6 నిందితుడు, బెటాలియన్ కానిస్టేబుల్ వెంకటేష్‌ను కొత్తగూడెం 2 టౌన్ పోలీసులు అరెస్ట్ చేసిన కేసు వివరాలను కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ వెల్లడించారు. కేసు వివరాల ప్రకారం.. నిందితుడు మైనర్ బాలికను కొత్తగూడెం పాత డిపో ప్రాంతంలోని ఒక గదికి తీసుకెళ్లిన సమయంలో, ఆ గదిలో నిందితులకు ఆశ్రయం కల్పించిన ఎ-6 బెటాలియన్ కానిస్టేబుల్ వెంకటేష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి బాధితురాలి తల్లి 11.07.2026న కొత్తగూడెం 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగాఎ-6 నిందితుడు వెంకటేష్‌ను కొత్తగూడెం 2 టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు.

## అభ్యుదయ సాహితీ సవ్యసాచి ఆచార్య రాచపాళెం

**ఘనంగా అడిగోపుల సాహిత్య ప్రతిభాపురస్కార ప్రదానం**




**తిరుపతి ,జూలై 17 :(వార్తా ప్రభ ప్రతినిధి):** తెలుగు సాహిత్యంలో కవిగా, విమర్శకునిగా ఐదు దశాబ్దాల సుదీర్ఘ ప్రస్థానం సాగిస్తున్న అభ్యుదయ సాహితీ సవ్యసాచి ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రసిద్ధ అభ్యుదయకవి అడిగోపుల వెంకటరత్నం పేరుమీద ఆయన కుటుంబ సభ్యులు నెలకొల్పిన "అడిగోపుల సాహిత్య ప్రతిభా పురస్కారం -2026" ను సుప్రసిద్ధ అభ్యుదయ సాహిత్య విమర్శకులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి అందుకున్నారు. తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం సాయంత్రం జరిగిన సభలో ఆస్ట్రేలియా "తెలుగుసందడి" సాహిత్య, సాంస్కృతిక వ్యవహారాల సంచాలకుడు అడిగోపుల శ్రీకాంత్ ఆహ్వానం పలికారు. వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున సభకు అధ్యక్షత వహించారు. ద్రవిడ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య ఈ. సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై అవార్డును ప్రదానం చేశారు. వక్తగా ప్రముఖ కవి బీరం సుందరరావు, విశిష్ట అతిథులుగా ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు ఆకుల మల్లేశ్వరరావు హాజరై మాట్లాడారు. తొలుత అడిగోపుల చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఆయన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్తలు, సాహితీవేత్తలు ప్రొ. కిరణ్ క్రాంత్ చౌదరి, ప్రొ. పిసి వెంకటేశ్వర్లు, గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, డా. నెమిలేటి కిట్టన్న, రాచపాలెం లక్ష్మి, డా. ఉషారాణి, డా. పాకనాటి గోపాల్, డా. నటరాజ నాయుడు, అరవ జయపాల్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు వైద్య పరీక్షలు



**చేజర్ల జూలై 17 (వార్తాప్రభ)** చేజర్ల ప్రభుత్వ వైద్యాధికారిణి డా.శ్రీమతి షేక్. మెహతాబ్ ఆధ్వర్యంలో చేజర్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థిని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు ఆరోగ్య విద్యను అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో చేజర్ల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మరియు ఆరోగ్య సహాయకులు మహీంద్రారెడ్డి మరియు మాధవి అరుణ మస్తానమ్మ సుజన భానుప్రియ లక్ష్మి మరియు యల్.టి.సుజాత ఆశాలు పాల్గొన్నారు.

## సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి సంగం లక్ష్మీబాయి యాదవ్ పేరు పెట్టండి

**-ముఖ్యమంత్రికి గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం విజ్ఞప్తి.**






**హైదరాబాద్,జూలై 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** హైదరాబాద్ నగరంలోని సైదాబాద్ ప్రాంతంలో నిర్మాణం పూర్తయి త్వరలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న స్టీల్ బ్రిడ్జికి తెలుగు రాష్ట్రాలలో మొదటి, దేశ తొలి మహిళా పార్లమెంటేరియన్‌లలో ఒకరైన, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు దివంగత సంగం లక్ష్మీబాయి యాదవ్ పేరును నామకరణం చేయాలని గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధురాలిగా, ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన సంగం లక్ష్మీబాయి యాదవ్ దేశ రాజకీయ చరిత్రలో విశిష్ట స్థానం సంపాదించారని తెలిపారు. మహిళా సాధికారతకు మార్గదర్శకురాలిగా నిలిచిన ఆమె సేవలను నేటి తరానికి పరిచయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. సంగం లక్ష్మీబాయి యాదవ్ ప్రజా జీవితంలో చేసిన సేవలకు గౌరవ సూచకంగా సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి ఆమె పేరును పెట్టడం ద్వారా ఆమెకు తగిన గుర్తింపు లభించడమే కాకుండా, భవిష్యత్ తరాలకు ఆమె స్ఫూర్తిదాయకమైన జీవితాన్ని పరిచయం చేసినట్లవుతుందని సంఘం అభిప్రాయపడింది. త్వరలో ప్రారంభం కానున్న ఈ స్టీల్ బ్రిడ్జి ప్రారంభోత్సవానికి ముందే రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలించి, లిసంగం లక్ష్మీబాయి యాదవ్ స్టీల్ బ్రిడ్జి"లిగా నామకరణం చేయాలని గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం ముఖ్యమంత్రి, మంత్రివర్గ సభ్యులు మరియు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వం ఈ డిమాండ్‌పై సానుకూల నిర్ణయం తీసుకుని, దేశానికి సేవలందించిన ప్రముఖ మహిళా నాయకురాలు సంగం లక్ష్మీబాయి యాదవ్‌కు శాశ్వత గుర్తింపునివ్వాలని యాదవ సంఘం కోరింది. అలాగే ఆమెకు సావిత్రీ బాయి పూలే అవార్డు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వంను యాదవ సంఘం డిమాండ్ చేసింది. ఈ సమావేశం లోయాదవ సంఘం గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ చిట్టబోయిన నందకిశోర్ యాదవ్, యాదవ సంఘం గ్రేటర్ హైదరాబాద్ ముఖ్య సలహాదారు వుశ్కెల పాండు యాదవ్, యాదవ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు బోయిని వెంకటేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## జూలై-26 న డంపింగ్ యార్డుపై జరిగే సదస్సును జయప్రదం చేయండి

- జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటకమిటీ ఆధ్వర్యంలో 7 వ రోజు పాదయాత్రలో ప్రజలకు సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కోమటి రవి పిలుపు.
- -సిపిఎం నాయకులు మరియు కమిటి కో కన్వీనర్ శివన్నారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమం.




**జవహర్ నగర్, జూలై 17:(వార్తా ప్రభ)** ప్రజల ప్రాణాలు, వారి ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న జవహర్ నగర్ రాంకీ చెత్త డంపింగ్ యార్డ్ ను వెంటనే ఎత్తివేయాలని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కోమటి రవి డిమాండ్ చేశారు. ముఖ్య అతిథిగా 7 వ రోజు జరిగిన పాదయాత్రకు హాజరైన అయన జూలై-26 న చెత్త డంపింగ్ యార్డు పై ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై జరుగుతున్న సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కీసర సర్కిల్, జవహర్ నగర్ జీహెచ్ఎంసీ పరిధిలోగల మల్కారం, ఫరానగర్ తదితర ప్రాంతాల్లో సిపిఎం నాయకులు మరియు కమిటీ కో కన్వీనర్ శివన్నారాయణ అధ్యక్షతన కార్యక్రమంలో చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్ కో- కన్వీనర్స్ సిపిఐ టి.శంకర్, సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ అనురాధ, (ఎంఎల్) మాస్ లైన్ గడ్డం సదానందం, ఏ.ఐ.ఎఫ్.టి.యు. వై మల్లేష్, కమిటీ మాజీ ఉపసర్పంచ్ ఆర్. నర్సింహ్మ గౌడ్, కోశాధికారి , ఐ.ఎఫ్.టి.యు. పి.శివబాబు, బి.ఎన్.ఆర్.కె.ఎస్. సూర వెంకటయ్య, ఇప్టూ అరుణ, టి.యు.సి.ఐ. వి.ప్రవీణ్, పిఓడబ్ల్యూ డి.స్వరూప, లక్ష్మీబాయి, భారతి, పిడిఎం చంద్రమౌళి, విజయ్, సిఎంఎస్ అల్లూరి సావిత్రి, జర్నలిస్ట్ కొన్నెవేణు, వెంకట్, కీసర సిపిఎం బంగారు నర్సింగరావు, బాలు, వెంకన్న, విజయ్ కుమార్, కర్నె సురేందర్, ఇఫ్టూ మారెపల్లి సురేందర్, తదితరులు హాజరై, జూలై 26 న పర్యావరణ, శాస్త్రవేత్తలతో జరగబోయే భారీ సదస్సుకు తరలిరావాలని కోరారు. జూలై మొదటి వారం నుండే సన్నాహక సదస్సులో బాగంగా డంపింగ్ యార్డ్ ప్రభావిత చుట్టుపక్కల గ్రామాలు కాలనీలలో పాదయాత్రలు చేపట్టి, ప్రజలలో అవగాహన కార్యక్రమం చేపట్టామని వివరించారు. ఆయా ప్రాంతాల స్థానిక ప్రజా ప్రతినిధులను, పార్టీ, ప్రజాసంఘాలను కలిసి, డంపింగ్ యార్డును ఎత్తివేతకు జరిగే ప్రజా ఆందోళనలలో బాగస్వాములు చేయడానికి శ్రమిస్తున్నామని గుర్తుచేశారు. ఇలాంటి కార్యక్రమంలో డంపింగ్ యార్డ్ బాధితులు విధిగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. అన్ని వర్గాల ప్రజల జీవించే హక్కులో బాగంగా జరిగే ప్రజాస్వామిక, న్యాయమైన పోరాటానికి ప్రజాస్వామిక వాదులు, ఇతర ప్రజా రాశులు తమ సంపూర్ణ మద్దతును తెలపాలని కోరారు.

## హిందూ స్మశాన వాటికలో ఇతర మతాలకు స్థల కేటాయింపు యత్నం అంగీకారమా?

- చర్లపల్లిలో ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ హెచ్చరిక..
- శతాబ్దాలుగా హిందువుల అంత్యక్రియలకు వినియోగంలో ఉన్న స్థలాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్..
- నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే కలెక్టర్, ఆర్డీవోను కలిసి ఉద్యమానికి సిద్ధమని హెచ్చరిక..





**కాప్రా, చర్లపల్లి, జులై 17: (వార్తా ప్రభ)** కాప్రా సర్కిల్ పరిధిలోని చిన్న చర్లపల్లిలోని హిందూ స్మశాన వాటికలో ఇతర మతాలకు స్థలం కేటాయించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న సమాచారంపై ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. శతాబ్దానికి పైగా హిందువుల అంత్యక్రియల కోసం వినియోగంలో ఉన్న ఈ స్మశాన వాటికను సందర్శించిన ఆయన, హిందూ స్మశాన వాటిక స్వరూపాన్ని మార్చే ఎలాంటి చర్యలనైనా తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ, కొందరు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం హిందూ స్మశాన వాటికలో ముస్లింలు, క్రైస్తవులకు స్థలం కేటాయించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. హిందువుల సంప్రదాయాలు, ఆచారాలను దృష్టిలో ఉంచుకుని ఈ స్థలాన్ని యథాతథంగా కేవలం హిందువుల అంత్యక్రియల కోసమే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఇతర మతాల వారికి అవసరమైతే ప్రభుత్వం వేరే చోట తగిన స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ అంశంపై త్వరలోనే జిల్లా కలెక్టర్, ఆర్డీవోను కలిసి వినతిపత్రం అందజేస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ హిందూ స్మశాన వాటిక వినియోగంలో మార్పులను సహించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చిన్న చర్లపల్లి, పరిసర కాలనీలకు చెందిన వివిధ కుల సంఘాల అధ్యక్షులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ మద్దతు తెలిపారు

## విజయవాడ రైల్వే రద్దీకి ప్రత్యామ్నాయంగా రాయనపాడు స్టేషన్ ప్రారంభం

- అమృత్ భారత్ పథకంలో రూ.35 కోట్లతో ఆధునికీకరణ.
- వర్చువల్ ప్రారంభించిన ప్రధాని మోడీ
- ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి సత్య కుమార్ యాదవ్, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్





**విజయవాడ రూరల్,17(వార్తా ప్రభ ప్రతినిధి):** విజయవాడ ప్రధాన రైల్వే స్టేషన్‌పై రోజురోజుకూ పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి శాశ్వత ప్రత్యామ్నాయంగా అభివృద్ధి చేసిన రాయనపాడు రైల్వే స్టేషన్ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ.35 కోట్లకు పైగా వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దిన ఈ స్టేషన్‌ను భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో శుక్రవారం ప్రారంభించారు. రాయనపాడు రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ , విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్, రైల్వే డి.ఆర్.ఎం పాల్గొన్నారు. స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఆధునిక సౌకర్యాలను పరిశీలించి, రాయనపాడు స్టేషన్ అభివృద్ధి విజయవాడ నగరంతో పాటు ఎన్టీఆర్ జిల్లా ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. రాయనపాడు రైల్వే స్టేషన్ అభివృద్ధికి ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో పనులు వేగంగా పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, ప్రయాణికుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని విశాలమైన ప్లాట్‌ఫారాలు, ఎయిర్ కండిషన్డ్ వెయిటింగ్ హాల్, లిఫ్టులు, ఆధునిక టికెట్ కౌంటర్లు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు, విశాల పార్కింగ్ స్థలం, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, కొండపల్లి కళారూపాలను ప్రతిబింబించే ఆకర్షణీయమైన ముఖద్వారం వంటి వసతులను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), బీజేపీ నియోజకవర్గ ఇంచార్జి నూతలపాటి బాల కోటేశ్వరరావు (బాల), కూటమి కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## మాదాపూర్ స్టేషన్ ఆఫీసర్ గా కె వి సుబ్బారావు




**శేరిలింగంపల్లి,జూలై 17 (వార్తాప్రభ):** సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మధాపూర్ పోలీస్ స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా ఇన్‌స్పెక్టర్ కె.వి.సుబ్బారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల సైబరాబాద్ పోలీస్ కమిషనర్ జారీ చేసిన 55 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీలలో భాగంగా కూకట్‌పల్లి ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించిన ఆయనను మధాపూర్‌కు బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీసు అధికారులతో సమావేశమైన సుబ్బారావు ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించడంతో పాటు చట్టాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఐటీ సంస్థలు అధికంగా ఉన్న మధాపూర్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, సైబర్ నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. ప్రజలు పోలీసులతో సమన్వయం చేసుకుంటూ తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని కోరారు. వివిధ కీలక పోలీస్ స్టేషన్లలో సేవలందించిన అనుభవం కలిగిన సుబ్బారావు మధాపూర్ ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు చేపట్టడంతో పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఓటు ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు లాంటిది.

**ప్రజాస్వామ్య పరిరక్షణ కొరకు కృషి చేయండి.**
**కాంగ్రెస్ సీనియర్ నాయకులు బల్లి శ్రీనివాస్.**



**జవహర్ నగర్, జులై 17: (వార్తా ప్రభ)** ఓటు భారత ప్రజాస్వామ్యానికి పునరు జీవనమని ప్రతి ఒక్కరూ ఎన్యుమరేషన్ ప్రక్రియలో పాల్గొని ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు బల్లి శ్రీనివాస్ గుప్తా పిలుపునిచ్చారు. ఓటు ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు లాంటిదని ఎస్ఐఆర్లో భాగంగా ప్రభుత్వ ఓటింగ్ అధికారులకు సహకరించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ పరిధిలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా కాంగ్రెస్ శ్రేణులతో శుక్రవారం ఎస్ఐఆర్ ప్రక్రియపై ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బల్లి శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటరే విలువైన శక్తి అన్నారు. జవహర్ నగర్ లో 100% ఎస్ఐఆర్ నమోదే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కల్లేపల్లి సదానంద్, సీనియర్ నాయకులు కొటేష్ గౌడ్, గజ్వేల్ శంకర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## నమస్తే దినోత్సవం పై అవగాహన



**ఇబ్రహీంపట్నం, జులై 17(వార్తా ప్రభ ప్రతినిధి):** నమస్తే దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండపల్లి మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్, డిబిఆర్సి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ నమస్తే పథకం ద్వారా సానిటరీ వర్కర్స్, హెయిర్ పిక్కర్స్ మరియు పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న వివిధ ప్రయోజనాలను వివరించారు. సిటీ కోఆర్డినేటర్ నందేటి అనిత మాట్లాడుతూ ఈ పథకం ద్వారా లభించే సామాజిక భద్రత, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు, భద్రతా పరికరాల వినియోగం, ఆరోగ్య పరిరక్షణ, ఆర్థిక సాధికారత వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వి.వెంకట రత్నం శానిటరీ ఇన్స్పెక్టర్ ఇంచార్జ్, షేక్ సుభాని కోఆర్డినేటర్, ఏఎన్ఎం, సానిటరీ వర్కర్స్, హెయిర్ పిక్కర్స్, సచివాలయం సిబ్బంది మరియు ఇతరులు పాల్గొన్నారు.

## నీట్‌లో 606 మార్కులతో మెరిసిన కొత్తగూడెం విద్యార్థిని

**23 లక్షల మంది అభ్యర్థుల్లో ఆల్ ఇండియా ర్యాంక్ 8182 సాధించి ప్రతిభ చాటిన వేమిశెట్టి నైష**
**హర్షం వ్యక్తం చేస్తున్న ప్రముఖులు**



**భద్రాద్రి కొత్తగూడెం జూలై 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** జిల్లాకు చెందిన ప్రతిభావంతురాలు నీట్ 2026 పరీక్షలో విశిష్ట ప్రతిభ కనబరిచింది. మెడికేర్ డయాగ్నస్టిక్ సెంటర్ యజమాని డాక్టర్ ఉపేంద్రరావు మనవరాలు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ సిరి దంపతుల కుమార్తె, వేమిశెట్టి, నైష 700 మార్కులకుగాను 606 సాధించి 2026 నీట్ పరీక్షలో ఆల్ ఇండియా ర్యాంక్ 8182ను కైవసంచేసుకుంది. దేశవ్యాప్తంగా సుమారు 23 లక్షల మంది విద్యార్థులు పోటీ పడిన ఈ ప్రతిష్ఠాత్మక పరీక్షలో అత్యుత్తమ ర్యాంక్ సాధించడం ద్వారా కొత్తగూడెం జిల్లాకు గర్వకారణంగా నిలిచిందని . చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో చదువుపై దృష్టి పెట్టిన ఆమె నిరంతర శ్రమ, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంతో ఈ విజయాన్ని అందుకుంది. ఆమె సాధించిన విజయం పట్ల కుటుంబ సభ్యులు, వైద్య వర్గాలు, స్నేహితులు, పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఉత్తమ వైద్యురాలిగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షిస్తూ ఆమెకు అభినందనలు తెలియజేశారు. ఈ విజయం నీట్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని, పట్టుదల, కృషి ఉంటే లక్ష్యాలను తప్పక చేరుకోవచ్చని విద్యావేత్తలు పేర్కొన్నారు.

# నేడు గుడివాడకు సీఎం చంద్రబాబు

● స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొనున్న సీఎం.. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో సన్నాహాలు..







**గుడివాడ,జూలై 17 (వార్తాప్రభ) :** శనివారం గుడివాడకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానున్నారు. గౌతమ్ పాఠశాల వద్ద జరగనున్న స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సీఎంఓ అధికారులతో కలిసి గుడివాడ బైపాస్ రోడ్డు, ఇంజనీరింగ్ కళాశాల, ఏఎన్ఆర్ కళాశాలలను పరిశీలించారు. సీఎం పర్యటన విజయవంతానికి శుక్రవారం ఉదయం గుడివాడ -మున్సిపల్ కౌన్సిల్ హాల్లో కలెక్టర్ డీకే బాలాజీ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. భద్రత, ట్రాఫిక్, ఏర్పాట్లు, ప్రజా సౌకర్యాలపై అధికారులకు పలు సూచనలు చేస్తూ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొని పర్యటన ఏర్పాట్లపై కీలక సూచనలు చేశారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమం విజయవంతానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. సీఎం పర్యటనను ప్రజా ఉత్సవంగా నిర్వహిస్తామని, అధికారుల సమన్వయంతో కూటమి నాయకత్వం పూర్తి స్థాయిలో భాగస్వామ్యం అవుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సీఎం పర్యటనలో భాగంగా ఏఎన్ఆర్ కళాశాలలో హెలిప్యాడ్, ఎన్టీఆర్ స్టేడియంలో బహిరంగ సభ, బైపాస్ రోడ్డు లోని యలవర్తి గ్రౌండ్స్‌లో టీడీపీ ముఖ్య కార్యకర్తల సమావేశ వేదికలను అధికారులు ఖరారు చేశారు. సీఎం పర్యటనకు గంటల వ్యవధి ఉండడంతో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నాయకత్వంలో టీడీపీ నాయకత్వం ముమ్మర ఏర్పాట్లలో నిమగ్నమైంది. సీఎం పర్యటన ఏర్పాట్లు మరియు సమావేశంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్ కుమార్, గుడివాడ ఆర్డీవో బాలసుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్‌లతో పాటు పోలీస్, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బి.బి.ఏ. ఆధ్వర్యంలో సోనమ్ వాంగ్ చుక్ దీక్షకు మద్దతు తెలిపిన న్యాయవాదులు




**విజయవాడ లీగల్,జూలై 17 (వార్తాప్రభ) :** విజయవాడ న్యాయస్థానాల వద్ద శుక్రవారం నాడు బి బి ఏ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద గత 20 రోజులుగా ప్రశ్నాపత్రాల లీకేజి లను అరికట్టాలని,మెరుగైన పరీక్షా విధానం కోసం,భారత దేశ యువత బంగారు భవిష్యత్తు కోసం నిరాహార దీక్ష చేస్తున్న శాస్త్రవేత్త సోనమ్ వాంగ్ చుక్ దీక్షను విరమింపచేయాలని, చర్చలు జరిపి వారి ప్రాణాలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బెజవాడ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణుభొట్ల లక్ష్మీ నారాయణ ఈ సందర్భంగా మాట్లాడుతూ వాంగ్ చుక్ విద్యార్ధుల భవిష్యత్తు కోసం ప్రజాస్వామ్య యుతంగా దీక్ష చేస్తున్నారని,కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి బృందం వెంటనే వారితో చర్చలు జరిపి వారి డిమాండ్లను నెరవేర్చాలని, అత్యంత విలువైన వారి ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు.దీక్షలో ఉన్న వారితో చర్చలు జరపడం ప్రభుత్వ బాధ్యత అని వారితో దీక్ష విరమింప చేస్తే ప్రభుత్వ ప్రతిష్ట పెరుగుతుందని కనుక వాంగ్ చుక్ తో చర్చలు జరిపి అత్యంత విలువైన వారి ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బెజవాడ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.కిరణ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యులు ఆర్.గంగాభవాని,సీనియర్ న్యాయవాదులు ఆలూరి సుధాకర్ రావు,అబ్దుల్ మతీన్,వేపాటి రాజారత్నం, వేము.కోటేశ్వరరావు, ఏ.ఎస్.ఎస్. రాంప్రసాద్,పిచ్చుక శ్రీనివాసరావు,సంపర శ్రీనివాసరావు,బోను జయమ్మ, సివి సుబ్రహ్మణ్యేశ్వర రావు,ఆవుల వెంకట రావు, కె.వి ప్రసాద రావు మరియు పెద్ద ఎత్తున యువ,మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

# పరిచయంలేని వ్యక్తులతో బాలికలు వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దు -రూరల్ డీసీపి లక్ష్మీనారాయణ(ఐపీఎస్)

● మైలవరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు







**మైలవరం,జూలై 17 (వార్తాప్రభ) :** బాలికలు తమ చదువుపై దృష్టి సారించి,భవిష్యత్ లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని,అలాగే పరిచయం లేని వ్యక్తుల తో వ్యక్తిగత వివరాలు, ఫోటోలు, వీడియోలు పంచుకోవద్దని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (రూరల్) లక్ష్మీనారాయణ ఐపీఎస్ వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థిను లకు భద్రత, సైబర్ నేరాలపై మైలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.కిషోర్ బాబు ఆధ్వర్యంలో ఎస్ ఐ సుధాకర్ పర్యవేక్షణలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సు కు ముఖ్య అతిధిగా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (రూరల్)లక్ష్మీనారాయణ,ఐపీఎస్ హాజరయ్యా రు.ఈ సందర్భంగా రూరల్ డీసీపీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఇన్స్టాగ్రామ్, స్నాప్చాట్ ,ఫేస్బుక్ వంటి సోషల్ మీడియా వేదికలను బాధ్యతాయుతంగా వినియోగించా లన్నారు. ముఖ్యంగా పరిచయం లేని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఫోటోలు, వీడియోలు పంచుకోవద్దని హెచ్చరించారు.అలాగే ప్రేమ పేరు తో జరిగే మోసాలు, ఆన్లైన్ స్నేహాలు, సైబర్ వేధింపులు, నకిలీ సోషల్ మీడియా ఖాతాలు, బ్లాక్‌మెయిల్ వంటి నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అనుమానాస్పద పరిస్థితి ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయు లు లేదా పోలీసులను సంప్రదించాలన్నారు. విద్యార్థులు పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకుని, ఎలాంటి దృష్టి మళ్లింపులు లేకుండా వాటిని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు, బలమైన పాస్‌వర్డ్‌ల వినియోగం, OTP లు, బ్యాంకు వివరాలు ఎవరికీ చెప్పకూడదని వివరించారు.అత్యవసర పరిస్థితుల్లో 112, మహిళల భద్రతకు సంబంధించిన 181 హెల్ప్‌లైన్ మరియు సైబర్ మోసాల కోసం 1930 హెల్ప్‌లైన్ ను వినియోగించాలని తెలియజేశారు. విద్యార్థినులు తమ తల్లిదండ్రులకు కూడా ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలియజేయాలని, హెల్మెట్ ప్రాణాలను కాపాడే రక్షణ కవచమని వివరించారు. ఈ సదస్సు కు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. రాజశేఖర్,ఉపాధ్యాయులు, సుమారు 700 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.

## విద్యార్థిలతో కలిసి భోజనం చేసిన హెచ్.యం. నక్కా బాబురావు..



**పెనుగంచిప్రోలు,జూలై 17 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు గ్రామం లోని స్వామి పుల్లయ్య మె మో రియల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లో హెచ్ యం నక్కా బాబురావు శుక్రవారం పిల్లల తో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు,బాబురావు ప్రతిరోజు మె మో ప్రకారం శుభ్ర మై న రుచికరమైన ఆహారాన్ని వండి పిల్లల తో పాటు తానుకుడా పాఠశాల లోనే భోజనం చేస్తాన ని తెలిపారు,పిల్లలతో కలిసి భోజనం చేయడం వల్ల ఆహారంలో లోపాలు ఉంటే సరి చేసుకో వచ్చు అన్ని తెలిపారు..

# కోవిడ్‌పై ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉందాం..

- రోజువారీ జీవితంలో జాగ్రత్తలు తీసుకుందాం
- ముందు జాగ్రత్తగా జీజీహెచ్‌లో ప్రత్యేక కోవిడ్ వార్డు
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**విజయవాడ,జూలై 17 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో కోవిడ్ కేసులు వెలుగుచూస్తున్న నేపథ్యంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండి అవసరమైన ముందు జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తోందని.. ఎవరూ భయపడాల్సిన పనిలేదని, ముందు జాగ్రత్తగా విజయవాడ జీజీహెచ్‌లో 15 పడకలతో ప్రత్యేక కోవిడ్ వార్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైద్యులు, సిబ్బందితో పాటు అవసరమైన మందులు, ఉపకరణాలు అన్నింటినీ సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే దాదాపు 45 మందికి పరీక్షలు చేసినా ఎవరికీ పాజిటివ్ రాలేదన్నారు. అయినా ముందస్తు చర్యల్లో భాగంగా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉన్నట్లు తెలిపారు. జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, శ్వాస సంబంధిత ఇబ్బందులు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యుల సలహా తీసుకోవాలని సూచించారు. వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. చేతులు శుభ్రంగా కడుక్కోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, అవసరమైన చోట మాస్క్ ధరించడం వంటి జాగ్రత్తలను పాటించాలని సూచించారు. వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు.

# ప్రజా ప్రాణాలతో చెలగాటం ఆడితే అధికారులపై కఠిన శిక్షలు తీసుకుంటా - ఎమ్మెల్యే బోడె



**కంకిపాడు, జూలై 17 (వార్తాప్రభ) :** వైసీపీ పాలనలో అలవాటైన నిర్లక్ష్యానికి అధికారులు ముగింపు పలకకుండా, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే కఠిన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ హెచ్చరించారు. పెనమలూరు నియోజకవర్గంలోని ఆకునూరు గ్రామ సమీప జాతీయ రహదారి వెంబడి వర్షపు నీరు నిల్వ ఉండి,మట్టి పేరుకుపోయి బురదగా మారడంతో వాహనదారులు,ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని పరిశీలించిన ఎమ్మెల్యే శ్రీ బోడే ప్రసాద్ సంబంధిత అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు చేయాల్సిన పనిని తానే స్వయంగా పార చేతబట్టి కచ్చా డ్రైన్ తవ్వి నిల్వ నీటిని బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టారు,ఎమ్మెల్యే స్వయంగా రంగంలోకి దిగి పనులు చేయాల్సిన పరిస్థితి రావడం వైసీపీ పాలనలో అధికారులకు పెరిగిన బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా కనబడుతుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,గత వైసీపీ పాలనలో ప్రజా సమస్యలను పట్టించుకోని నిర్లక్ష్య సంస్కృతి అధికారు ల్లోకి చొరబడింది,కూటమి ప్రభుత్వంలో ఆ నిర్లక్ష్యానికి స్థానం లేదు,ప్రజ లకు ఇబ్బంది కలిగించే ఏ అధికారి అయినా బాధ్యత వహించాల్సిందే అని స్పష్టం చేశారు. ఆకునూరు పంచాయతీ కార్యదర్శిని తీవ్రంగా హెచ్చరిస్తూ,ప్రజలకు సేవ చేయాల్సిన అధికారులు బాధ్యతలు విస్మరిస్తే సహించేది లేదని,అవసరమైతే కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. జాతీయ రహదారి వెంబడి ఉన్న గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఫీల్డ్‌లో పర్యటిస్తూ రోడ్లు,డ్రైనేజీలు, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించాలని ఎమ్మెల్యే గారు ఆదేశించారు,నిర్లక్ష్యం, అలసత్వం ప్రదర్శిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు స్వయంగా పార చేతబట్టి నీటి నిల్వ తొలగించిన ఎమ్మెల్యే బోడే ప్రసాద్ గారిని స్థానికులు అభినందిస్తూ, "ప్రజల మధ్య ఉండే నాయకుడే నిజమైన నాయకుడు" అని కొనియాడారు.

# మంత్రి లోకేష్ ను కలిసి అగ్నికుల క్షత్రియ సమస్యలపై వినతి పత్రం ఇచ్చిన... అగ్నికుల క్షత్రియ చైర్మన్,, మరియు డైరెక్టర్లు....



**కృత్తివెన్ను,జూలై 17 (వార్తాప్రభ) :** అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు మరియు డైరెక్టర్ తిరుమల శెట్టి చంద్రమౌళి ఇతర డైరెక్టర్లతో కలిసి తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వహణ అధ్యక్షులు, రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను గురువారం ఉండవల్లి లోని మంత్రి అధికారిక నివాసంలో కలసి అగ్నికుల క్షత్రియులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, సంక్షేమం, అభివృద్ధి అంశాలపై లోకేష్ దృష్టికి తీసుకుని వెళ్లి సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం ఇచ్చారు. పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతి (07-08-1869)ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా రాష్ట్ర పండుగగా ప్రకటించాలని, రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా లైసెన్స్ పొందిన మరపడవలకు సంబంధించి హోల్డ్ లో ఉన్న కొత్త బోట్ల లబ్ధిదారులు 6,497 అర్హులైన మత్స్యకారులకు వేట నిషేధ భృతి అందేల విధంగా చూడాలని, 1000 లీటర్ల తక్కువ వినియోగ కారణంగా ధ్రువీకరణలో ఉంచబడిన ఎం ఎం బోట్ల లబ్ధిదారులు 5910 అర్హులైన మత్స్యకారుల వేట నిషేధ భృతి నిధులు మంజూరు చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అగ్నికుల క్షత్రియులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేసి జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా తోడ్పడగలరని ఎనిమిది అంశాలపై వినతిపత్రం మంత్రి లోకేష్ కు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ కు జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా అగ్నికుల క్షత్రియుల సంక్షేమం మరియు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వీలైనంత తొందరలో సమస్యల పరిష్కారానికి సానుకూల చర్యలు తీసుకుంటామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారని డైరెక్టర్ తిరుమల శెట్టి చంద్రమౌళి తెలియజేశారు.

## నవాబుపేట గ్రామాన్ని పరిశీలించి మండల తహసీల్దార్ కళ్యాణి....



**పెనుగంచిప్రోలు,జూలై 17 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండలం లోని నవాబుపేట గ్రామాన్ని మండల తహసీల్దార్ కళ్యాణి శుక్రవారం పర్యటించారు, గ్రామం లోని మెడికల్ షాపు, వాటర్ ట్యా శీ కు, సచివాలయం, పరిశీలించి న్నారు, వాటర్ ట్యాంకు ను ఇప్పటి కప్పుడు సుబ్రపరచాలని, మెడికల్ షాపు లో కాల పరిస్థితి దాటిన మందుల ను అమ్మ రాదని తెలిపారు, సచివాలయం సిబ్బంది పనితీరును ఆర్ ఐ అబ్దుల్ హాలీం వీ ఆర్వో చైతన్య తో కలిసి పరిశీలించారు..

## పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి




**పెనుగంచిప్రోలు, జూలై 17 (వార్తాప్రభ) :** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మరియు ఉదయభాను కృషితో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వార పెనుగంచిప్రోలు మండలంలో ఉన్న కొన్ని గ్రామాలల్లో ఉన్న అర్హులకు సుమారుగా 5 లక్షల వరకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పెనుగంచిప్రోలోని ఆర్కే ఫంక్షన్ హాల్ నందు నియోజకవర్గం జనసేన నాయకులు లగడపాటి శంకర్, తునికి పాటి శివా చేతులు మీదుగా ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుపేదలకు అత్యవసర వైద్య, ఆర్థిక అవసరాల సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా తోడ్పడుతుంది, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పేదలకు భరోసాగా నిలుస్తోందన్ని అన్నారు,ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు మరియు లగడ పాటి శంకర్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ తునికిపాటి శివ, మహిళా విభాగం నాయకురా లు కాకాని పద్మ జిల్లా నాయకుడు నీటి సంఘం అధ్యక్షులు వై.ఎస్.ఆర్ మాస్టర్ ఈమని కిషోర్ దొడ్ల వినయ్ లింగరాజు చారి నవీను సాయి అభి మధు శేఖర్ గోపి తదితరులు పాల్గొన్నారు....

# నీట్ ఫలితాల్లో ఆదిత్యకు జాతీయర్యాంకులు













**కాకినాడ,జూలై 17 (వార్తాప్రభ) :** ఎన్టీఏ ప్రకటించిన నీట్-2026 ఫలితాలలో ఆదిత్య విద్యార్థులు మరోసారి ఆలిండియా జాతీయ ర్యాంకులు దక్కించుకుని ఆదిత్య విద్యా పటిమను ఇనుమడింప చేశారు. ఆల్ ఇండియా ర్యాంకుల్లో వి.వి.ఎన్.డి.శ్రీరామ్ 220వ ర్యాంకు, గంటి సాయి అభినవ్ 529వ ర్యాంకు, కె.తస్విక 549వ ర్యాంకు, ఎమ్. అభిరామ్ రాజు 925వ ర్యాంకు, డి.ఎన్.సాయిమణికంఠ 969వ ర్యాంకులను సాధించారని ఆదిత్య విద్యాసంస్థల సెక్రటరీ ఎన్.కె. దీపక్ రెడ్డి తెలిపారు. ఆలిండియా నీట్ ఫలితాలలో 550 మార్కులు పైన 30 మంది విద్యార్థులు, అత్యున్నత మార్కులు సాధించి, ఆంధ్రప్రదేశ్ విద్యారంగంలో 'ఆదిత్య' అగ్రగామియని ఋజువు చేసుకొందని, ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్. శేషారెడ్డి అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థికి తగినన్ని టెస్టులతో ప్రాక్టీసు చేయించామని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను ఆదిత్య విద్యాసంస్థల సెక్రటరీ ఎన్.కె. దీపక్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ అడ్మిషన్లు ఆదిత్య గంగరాజు నగర్, మారికవలస, విశాఖపట్నంలో ప్రారంభించినట్టు తెలిపారు.

# సుమారు.రూ. 11లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధితులకు అందజేసిన రాష్ట్ర మంత్రివర్యులు కొలుసు పార్థసారథి



**ముసునూరు/ఏలూరు,జూలై 17 (వార్తాప్రభ) :** ముసునూరు మండలం వేల్పుచర్ల గ్రామ సచివాలయ దగ్గర రాష్ట్ర మంత్రివర్యులు కొలుసు పార్థసారథి ఇటీవల వైద్యం చేయించుకున్న సుమారు.22మంది బాదిత కుటుంబాలకు సుమారు. రూ.11లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేసిన మంత్రివర్యులు కొలుసు పార్థసారధి. మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి సంజీవని వంటిదని అన్నారు. రాష్ట్రంలో పేద ప్రజల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తుందని దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వైద్యం చేసుకున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిది సంజీవని వరం అన్నారు. రాష్ట్రంలో 104 వాహనం మాదిరిగా 109వాహనం గ్రామంలోని ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు చేసి ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పిస్తుందని అన్నారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదని. కానీ కూటమి ప్రభుత్వంలో నూజివీడు నియోజకవర్గములో ఇప్పటి వరకూ సుమారు.రూ15కోట్లు విలువైన ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులు అందించామన్నారు.ప్రభుత్వ ఆసుపత్రిలోని మెరుగైన వైద్యం కోసం మెరుగైన వైద్య పరికరాల ఏర్పాటుకు వేలకోట్ల ఖర్చు చేసిందని తద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు.కూటమి ప్రభుత్వంలో ప్రజల ఆరోగ్య భద్రతతో సంతోషంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు,జి, రఘు వేణు,తహశీల్దార్, ఇతర ప్రభుత్వ అధికారులు, ,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సర్.. నూరు శాతం పూర్తి చేశాం..

- జిల్లాలో 17,13,445 మంది ఓటర్ల వివరాలు డిజిటైజేషన్ చేశాం
- పారదర్శకంగా ముగిసిన డిజిటైజేషన్ /ఆన్లైన్ ప్రక్రియ
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**విజయవాడ,జూలై 17 (వార్తాప్రభ) :** ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో కీలక ప్రక్రియ అయిన ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ 100 శాతం పూర్తయిందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. మొత్తం 17,13,445 మంది ఓటర్లకు సంబంధించి పారదర్శకంగా డిజిటైజేషన్/ఆన్లైన్ ప్రక్రియ ముగిసినట్లు పేర్కొన్నారు. బీఎల్ఓల ఇంటింటి సందర్శనకు ఈసీఐ ఈ నెల 24వ తేదీ వరకు గడువు పొడిగించినందున కార్యక్రమంలో మరింత పారదర్శకత, కచ్చితత్వానికి సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. ఈనెల 31వ తేదీన ముసాయిదా జాబితా ప్రచు-రణ ఉంటుందని.. అప్పటి నుంచి ఆగస్టు 30వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలకు వీలుంటుందన్నారు. ఈ నెల 31వ తేదీ నుంచి సెప్టెంబర్ 28వ తేదీ వరకు నోటీసు దశ, క్లెయిములు, అభ్యంతరాల పరిష్కారం ఉంటుందని వివరించారు. చివరిగా అక్టోబర్ 3వ తేదీన తుది జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితా విశిష్టత స్ఫూర్తితో ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేసి ప్రక్రియను సజావుగా ముందుకు తీసుకెళ్లడంలో భాగస్వాములైనట్లు తెలిపారు. తిరువూరు నియోజకవర్గంలో 2,08,707 మంది ఓటర్లు, విజయవాడ పశ్చిమలో 2,56,980, విజయవాడ మధ్యలో 2,77,822, విజయవాడ తూర్పులో 2,69,734, మైలవరంలో 2,85,168, నందిగామలో 2,07,481, జగ్గయ్యపేటలో 2,07,553 మంది ఓటర్లకు సంబంధించి 100 శాతం డిజిటైజేషన్ పూర్తయినట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు.

# హనుమాన్ జంక్షన్‌లో గాంధీ అర్బన్ బ్యాంక్ కొత్త భవన ప్రారంభోత్సవం

- ఆధునిక సేవలతో ఖాతాదారులకు మరింత చేరువలో గాంధీ అర్బన్ బ్యాంక్





**హనుమాన్ జంక్షన్,జూలై 17 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్‌లో గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ నూతన భవన ప్రారంభోత్సవం సందర్భంగా ఖాతాదారుల సమావేశం ఘనంగా నిర్వహించారు. బ్యాంకు చైర్మన్ వేమూరి వెంకట్రావు, వైస్ చైర్మన్ ఏ.కే. అన్సారీ, పాలకవర్గ సభ్యులు, అధికారులు, ఖాతాదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ వేమూరి వెంకట్రావు మాట్లాడుతూ, బ్యాంకు గత 98 ఏళ్లుగా విశ్వసనీయ సేవలు అందిస్తోందని, హనుమాన్ జంక్షన్ శాఖ 15 ఏళ్లుగా స్థానిక ప్రజలకు నాణ్యమైన బ్యాంకింగ్ సేవలు అందిస్తోందని తెలిపారు. శాఖలో రూ.11 కోట్ల డిపాజిట్లు, రూ.17 కోట్ల రుణాలు ఉండగా, బ్యాంకు మొత్తం రూ.9 కోట్ల లాభాన్ని నమోదు చేసిందన్నారు. యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్ వంటి ఆధునిక సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. స్థానిక వ్యాపారులకు ప్రోత్సాహంగా రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వ్యాపార రుణాలు అందించే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సగ్గుర్తి నాగేశ్వరరావు, కోగంటి వెంకటరమయ్య, టీవీఎస్ ఆంజనేయరాజు, బోగాది శివరామకృష్ణ ప్రసాద్, సజ్జ సుభాష్ తేజ, సుంకర కిషోర్ బాబు, సజ్జ రాజశేఖర్, సీఈఓ ఎం.బి. పద్మిని, సీఓఓ కె. శివప్రసాద్, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

# కంకిపాడులో 90 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బోడె



**కంకిపాడు,జూలై 17 (వార్తాప్రభ) :** వైసీపీ ఐదేళ్ల నిర్లక్ష్యంతో నిలిచిపోయిన కంకిపాడు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఊపిరి పోస్తుందని నియోజకవర్గ శాసనసభ్యులు ప్రసాద్ అన్నారు. కంకిపాడు గత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పూర్తిగా అస్తవ్యస్తమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడగా,కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కంకిపాడు గ్రామంలో వరుసగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తెలిపారు... కంకిపాడు గ్రామంలో రూ.90 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,భద్రాచలం వీధి ఎన్నో ఏళ్లుగా లోతట్టు ప్రాంతంగా ఉండటంతో ప్రతి వర్షానికి నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు, గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన రహదారులను ఇప్పుడు కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తోందని పేర్కొన్నారు... ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణానికి గతంలోనే సుమారు రూ.3 కోట్ల నిధులు మంజూరైనా,వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం, పరిపాలనా వైఫల్యంతో ఆ పనులు నిలిచిపోయాయని విమర్శించారు,ప్రస్తుతం అదే పనుల కోసం మళ్లీ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించామని,త్వరలోనే నిధులు విడుదలై పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. గత ఏడాది పల్లె పండుగ కార్యక్రమం ద్వారా రూ.1 కోటి విలువైన అభివృద్ధి పనులు,ప్రస్తుతం రూ.90 లక్షల పనులు,త్వరలో మరో రూ.2 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టి కంకిపాడును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ అన్నే ధనయ్య, మాజీ ఎంపీపీ దేవినేని రాజా, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు జంపాన వెంకటేశ్వరరావు, మాజీ సిహెచ్సి చైర్మన్ యలమంచిలి కిషోర్ బాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు చిట్టూరి నాగేశ్వరరావు, మండల బీసీ సెల్ నాయకుడు సంఘపు రంగారావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విలువలతో కూడిన విద్య అందించాలి



**కడప,జూలై 17 (వార్తాప్రభ) :** యూటైల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడప జిల్లాలో గల అక్కలరెడ్డి పల్లె అనే గ్రామంలో పిల్లల కొరకు స్టడీ సెంటర్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంస్థ ఫౌండర్ దాసరిపల్లి దినేష్ కుమార్ హాజరు అయ్యారు. ముందుగా జర్మనీ నుండి వచ్చిన ఫాదర్ సురేష్ కుమార్ రిబ్బన్ కట్ చేసి సెంటర్ ను ప్రారంభించారు. దినేష్ కుమార్ మాట్లాడుతూ పిల్లలకు చదువు ప్రాముఖ్యతను తెలియజేసి విలువలతో కూడిన విద్య, క్రమశిక్షణ కలిగి ఉండాలని చెప్పారు. అనంతరం పిల్లలకు పుస్తకాలు,పలకలు, స్టేషనరీ కిట్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ పెరికె మహేష్ బాబు, ఐటీ అడ్మిన్ అశోక్ కుమార్, గిద్దలూరు నియోజకవర్గ సెక్రటరీ డి.లక్షుమయ్య లతో పాటుగా పిల్లల తల్లిదండ్రులు గ్రామస్థులు కూడా పాల్గొన్నారు.పిల్లలకు స్టడీ సెంటర్ ప్రారంభించడం ద్వారా వారిని ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేందు స్టడీ సెంటర్ ప్రారంభించడం, వారికి పుస్తకాలు,తదితర ఉపయుక్తమైన సామగ్రి అందించిని యూటైల్ హ్యూమన్ రైట్స్ సంస్థ వారిని కాకినాడ కు చెందిన సామాజిక వేత్త,మానికి రెడ్డి హెల్త్ కేర్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మానికి రెడ్డి సత్యనారాయణ సంస్థ ప్రతినిధులను అభినందించారు.

# శివ చరణ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుండి తక్షణమే బహిష్కరించాలి

- కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ని కలిసి మెమోరండం సమర్పించిన బీసీ నేత బేరి రామచందర్ యాదవ్
- ఈశ్వరమ్మ యాదవ్ కు క్షమాపణ చెప్పాలి.. బేరి రామచందర్ యాదవ్ డిమాండ్





**హైదరాబాద్, జూలై 17 (వార్తాప్రభ) :** తెలంగాణా రాష్ట్ర యాదాద్రి శ్రీ లక్ష్మి నరసింహాస్వామి దేవస్థాన బోర్డు మెంబర్ గా బీసీ వర్గం నుండి పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ ఒక చిన్న పదవి వచ్చిన కారణంగా అగ్ర వర్ణాలకు చెందిన నాయకులు అక్కసు తట్టుకోలేక ఆమెపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఈ వ్యాఖ్యలను వెంటనే ఖండించి శివచరణ్ రెడ్డి నీ పార్టీ నుండి బహిష్కరించాలని, ఈశ్వరమ్మ యాదవ్ కు క్షమాపణ చెప్పాలని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర యాదవుల ఆత్మ గౌరవాన్ని కించపరిచేలా దుర్భాషలాడుతూ మాట్లాడిన ఆయన తీరుకు నిరసన తెలుపుతూ బేరి రామచందర్ యాదవ్ మిత్రబృందం కలిసి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి వినతి పత్రం సమర్పించారు. బేరి తో పాటు తెలంగాణ రాష్ట్ర బీసీ కుల సంఘాల ఐక్యవేదిక మరియు మేదరి మహేంద్ర సంఘం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు కొంటు ముకుందం , తెలంగాణ రాష్ట్ర బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్, తెలంగాణ రాష్ట్ర బీసీ కుల సంఘాల ఐక్యవేదిక మరియు బీసీ ఫెడరేషన్ ముఖ్య సలహాదారు పట్లూరి కృష్ణమోహన్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బిసి కుల సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు రాజశేఖర్ యాదవ్ , పులి రాజేందర్, నోముల ప్రవీణ్ కుమార్ , బీసీ కుల సంఘాల ఐక్యవేదిక ఆర్గనైజింగ్ సెక్రటరీ హరికృష్ణ చారి, ఉప్పల్ అధ్యక్షులు ఎం.వి.ఎస్ నాయక్, అన్నా నగర్ అధ్యక్షులు శ్రీశైలం గౌడ్ , బీ హెచ్ ఈ ఎల్ కీర్తి కుమార్, బిసి కుల సంఘాల ఐక్యవేదిక యువజన అధ్యక్షులు కొంటు సుమన్ , సిద్ధార్థ ముదిరాజ్, శీను పటేల్, మరియు అనేకమంది బీసీ నాయకులు కార్యకర్తలు దీని పై తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించాలని, ఈ సంఘటనను ఖండించాలని, శివచరణ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుండి బరిష్కరించి, తక్షణమే బహిరంగ క్షేమాపణ చెప్పాల్సిందే అన్నారు. లేకపోతే తెలంగాణా రాష్ట్ర యాదవుల ఆగ్రహానికి గురి కావాల్సిందే అని ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. మల్కాజ్ గిరి కాంటెస్ట్ ఎమ్మెల్యే మండలి రాధాకృష్ణ యాదవ్, రాయదుర్గం యాదవ సంఘం యూత్ ప్రెసిడెంట్ నాగపురి అశోక్ యాదవ్, వంగూరి సందీప్ యాదవ్, గౌడ సంఘం రాజు గౌడ్, కృష్ణ ముదిరాజ్, నాయి బ్రాహ్మణ సాయిలు, పద్మశాలి రమేష్, రజక సంఘం కిషోర్, జాతీయ భవన కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనంతయ్య, తదితర యాదవ్, బీసీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రజారోగ్యమే కూటమి ప్రభుత్వ ప్రాధాన్యం

-ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ,జూలై 17 (వార్తాప్రభ) :** శ్రీధర్ బీమా బజార్ ఆధ్వర్యంలో సెంటిని హాస్పిటల్--ఐసీఐసీఐ సహకారంతో నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వ విప్ స్థానిక శాసనసభ్యులు తంగిరాల సౌమ్య కోరారు. శుక్రవారం సీఎం రోడ్డులో శ్రీధర్ బీమా బజార్ ఆధ్వర్యంలో, సెంటిని హాస్పిటల్ మరియు ఐసీఐసీఐ సంస్థల సహకారంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య సంరక్షణకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు తోడు కార్పొరేట్ సంస్థలు, సేవా సంస్థలు సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి ఆరోగ్య శిబిరాల ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు నిపుణులైన వైద్యుల సేవలు, అవసరమైన వైద్య పరీక్షలు ఉచితంగా అందడం ఎంతో ప్రయోజనకరమని అన్నారు. ప్రజలు తమ ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు రోగులను పరీక్షించి తగిన వైద్య సూచనలు అందించడంతో పాటు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, వైద్యులు, శ్రీధర్ బీమా బజార్ ప్రతినిధులు, ఐసీఐసీఐ ప్రతినిధులు, సెంటిని హాస్పిటల్ వైద్య బృందం, పార్టీ కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# నూతన కళాశాల భవనాన్ని ప్రారంభించనున్న మంత్రి నారా లోకేష్



**కంకిపాడు,జూలై 17 (వార్తాప్రభ) :** పెనమలూరు నియోజకవర్గం, కంకిపాడు మండలం పునాదిపాడు గ్రామంలోని నూతన కళాశాల భవనాన్ని ఈనెల 27 లేదా 30వ తేదీన ప్రారంభోత్సవానికి రాష్ట్ర విద్య,ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ హాజరవుతున్నారని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తెలిపారు. పెనమలూరు నియోజకవర్గం,కంకిపాడు మండలం, పునాదిపాడు గ్రామంలో మంత్రి నారా లోకేష్ ప్రారంభించే కళాశాల భవనాన్ని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ,స్థానిక కూటమి నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ కళాశాల భవనాన్ని అమెరికాలో స్థిరపడినప్పటికీ స్వగ్రామ అభివృద్ధిపై అపారమైన మమకారంతో ఉన్న దాత పోలవరపు మధుసూదన్ రావు ,వారి కుమార్తె శోభా ఉదార సహకారంతో నిర్మించారు, భవన నిర్మాణానికి అవసరమైన వ్యయాన్ని పూర్తిగా వారి దాతృత్వంతో సమకూర్చి నిర్మించారన్నారు. తాము చదువుకున్న విద్యాసంస్థ మరింత అభివృద్ధి చెందాలని సంకల్పంతో మధుసూదన్ రావు పలుమార్లు స్వయంగా వచ్చి, పాఠశాల,కళాశాల అభివృద్ధికి అవసరమైన అంశాలపై సూచనలు అందిస్తూ, భవిష్యత్తులోనూ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. మంత్రి నారా లోకేష్ ని కలిసి కళాశాల భవనాన్ని ఆయన చేతుల మీదుగా ప్రారంభించాల్సిందిగా దాతలు కోరగా,మంత్రి సానుకూలంగా స్పందించి తప్పకుండా హాజరవుతానని హామీ ఇచ్చారు, కార్యక్రమం ఈ నెల 27 లేదా 30వ తేదీల్లో నిర్వహించనున్నట్లు,తుది తేదీ ఈరోజు ఖరారు కానుందని తెలిపారు. మంత్రి నారా లోకేష్ ఉదయం సుమారు 9 గంటలకు నియోజకవర్గానికి చేరుకుని,కళాశాల భవన ప్రారంభోత్సవంతో పాటు పాఠశాల అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు,అనంతరం ఆయన కళ్యాణ్ మండపం నందు జరిగే పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారని తెలిపారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# బంటుమిల్లి మండలంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం...




**కృత్తివెన్ను,జూలై 17 (వార్తాప్రభ) :** అర్తమూరు ముంజులూరు గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి నూరున్నీసా ఆధ్వర్యంలో నిర్వహించుట జరిగినది. ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన(పీఎంఫబయ్ )గురించి వివరించారు. పంటల భీమా పథకం ఖరీఫ్-2026 ను ఆంధ్ర ప్రదేశ్ మరియు భారత ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్నాయి అని తెలిపారు.ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశం ఏమనగా కరువు, తుఫాన్ లు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడి నష్టపోయిన రైతులకు ఆర్ధిక సహాయం అందించడం,వాతావరణ అంశాల ఆధారంగా సంభవించిన పంట నష్టాన్ని అంచనా వేసి భీమా పరిహారం చెల్లించుట,ఎంపిక చేసిన పంటలను సాగు చేస్తూ నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి నమోదు చేసుకున్న కౌలు రైతులతో సహా రైతులందరూ ఈ పథకంలో చేరటానికి అర్హులని తెలియజేశారు. వరి పంటకు గ్రామం యూనిట్ గా ప్రతి ఎకరానికి రైతు ప్రీమియం వాటా రూ. 830 /- కట్టి మీసేవా కేంద్రాలలో లేదా పంట రుణం తీసుకున్నట్లు అయితే సంబంధిత బ్యాంకులో ప్రీమియం ఆగస్టు 15 వ తేదీ లోపు చెల్లించి ఈ పథకం కింద అర్హత పొందాలని తెలియజేశారు..ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు..

# శ్యామ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ శైలజా శ్యామ్ కు దుర్గాబాయి దేశ ముఖ్ అవార్డు ప్రదానం




**కాకినాడ,జూలై 17 (వార్తాప్రభ) :** కాకినాడ విద్యుత్ నగర్‌లో గల ఐడియల్ కళాశాలలో ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్ (ఎఐడబ్ల్యూసి) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్యామ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ శైలజ శ్యామ్‌కు దుర్గాబాయి దేశ్‌ముఖ్ అవార్డును ఎమ్మెల్సీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కర్రీ పద్మశ్రీ మాట్లాడుతూ గ్రామీణ బాలికల విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం, అట్టడుగు వర్గాలకు చెందిన మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారానే నిజమైన సాధికారత సాధ్యమవుతుందని అన్నారు.మహిళలపై జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా గళం విప్పాలని, చట్టపరమైన మార్గాల ద్వారా తమ హక్కులను సాధించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి,దుర్గా బాయి దేశ్ ముఖ్ చిత్రం పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అవార్డు గ్రహీత శైలజా శ్యామ్ మాట్లాడుతూ విద్యార్థులు దుర్గా బాయి దేశ్ ముఖ్ ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఐడబ్ల్యూసి అధ్యక్షురాలు భాను శేషు,అవార్డు గ్రహీత శ్యామ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ శైలజ శ్యామ్,కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి. శ్రీకాంత్, వి.వి.లక్ష్మి, డాక్టర్ మాధవి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188

## ఎల్బీనగర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'యువ సంగ్రామ సదస్సు'..

**కాంగ్రెస్‌పై పోరుకు కేటీఆర్ శంఖారావం! - ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.**



**ఎల్బీనగర్/ వార్తాప్రభ ( జూలై 17):**ఎల్బీనగర్ సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో జూలై 18,శనివారం ఉదయం 10 గంటలకు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ 'యువ సంగ్రామ సదస్సు' నిర్వహించనున్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలనే డిమాండ్‌తో, కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరుబాట పట్టడమే ఈ సభ ముఖ్య ఉద్దేశం. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ సభ ఏర్పాట్లు అత్యంత చురుకుగా సాగుతున్నాయి.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి కేటీఆర్ హాజరుకానున్నారు. సభ విజయవంతం కోసం మెయిన్ రోడ్డుపై మునుపెన్నడూ లేని రీతిలో భారీ కటౌట్లు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు నిరుద్యోగులు, యువతతో పాటు బీఆర్ఎస్ ముఖ్య నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పిలుపునిచ్చారు.

## లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**ఎల్బీనగర్/ వార్తాప్రభ(జూలై 17):** హైదరాబాద్‌లోని తన నివాసంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కడ్తాల, తలకొండపల్లి,కల్వకుర్తి మండలాల లబ్ధిదారులకు ముఖ్య నాయకుల సమక్షంలో సీఎం సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులు, ఎల్ఓసీ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా వెంకట్రావుపేట గ్రామానికి బీటీ రోడ్డు, గ్రామపంచాయతీ భవనం మంజూరు చేసినందుకు తలకొండపల్లి మండల నాయకులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, తమ మండలాలకు నూతన గ్రామపంచాయతీలు మంజూరు చేయడంలో ప్రత్యేక చొరవ చూపినందుకు పలువురు ముఖ్య నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డి ని హృదయపూర్వక అభినందనలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఈ నెల 30న కలెక్టరేట్ వద్ద ధర్నా

**జయప్రదం చేయాలని సిఐటియు పిలుపు**



**గన్నవరం, జూలై 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఈ నెల 30వ తేదీన మచిలీపట్నం కలెక్టరేట్ వద్ద నిర్వహించబోయే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ముస్తాబాద్ పంచాయతీ కార్మికులకు, ఫ్లిప్‌కార్ట్ కార్మికులకు సిఐటియు నాయకులు శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు.?ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు కళ్ళం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా కార్మికులకు వేతన సవరణ జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల బతుకులు మారడం లేదని, యాజమాన్యాలు కార్మికులను బానిసలుగా చూస్తున్నాయని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త లేబర్ కోడ్‌ల వల్ల కార్మికుల పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుందన్నారు.?కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టే ఈ ధర్నాలో పారిశ్రామిక కార్మికులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు గన్నవరం మండల కన్వీనర్ బి. తాతబ్బాయి తదితర నాయకులు పాల్గొన్నారు.

## షైనింగ్ స్టార్ అవార్డ్స్ కు ఎంపికైన ఠాగూర్ పాఠశాల విద్యార్థులు



**అనుమనముద్రంపేట జూలై 17 (వార్తాప్రభ ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన షైనింగ్ స్టార్ అవార్డ్స్ లో ఓపెన్ క్యాటగిరీలో మండల కేంద్రమైన ఏఎస్ పేటలో ఉన్న ఠాగూర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కి చెందిన ఇద్దరు విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డ్స్ కు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్ వెంకట రమణారెడ్డి ప్రధానోపాధ్యాయులు కే దొరస్వామి రెడ్డి తెలిపారు. 2025-2026 విద్యా సంవత్సరం లో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులైన బి సాత్విక్ పి.వి. హేమశృతి లకు షేనింగ్ స్టార్ అవార్డులు ఎంపికైనట్లు తెలిపారు.ఈ అవార్డు కింద ప్రభుత్వం 20 వేల రూపాయల క్యాష్ అవార్డ్ ప్రశంస పత్రం మరియు మెడల్ తో సత్కరించడం జరుగుతుందని తెలిపారు.ఈ అవార్డు సాధించినందుకు ఠాగూర్ పాఠశాల యాజమాన్యము మరియు ఉపాధ్యాయ సిబ్బంది హర్షం వ్యక్తం చేసి ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

# రాయలసీమ అభివృద్ధిపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోంది: ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్



**నెల్లూరు, జూలై 17 :(వార్తా ప్రభ ప్రతినిధి):**రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పేరుతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరోసారి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని టీడీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, శాసనమండలి సభ్యుడు బీద రవిచంద్ర విమర్శించారు. నెల్లూరులోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు 2020 జూన్--జూలైలో సాంకేతిక, పరిపాలనా అనుమతులు ఇచ్చి, 2021 జూలైలోనే పనులను నిలిపివేసిన వైసీపీ ప్రభుత్వం, అనంతరం మూడేళ్లపాటు ప్రాజెక్టు అనుమతుల కోసం ఎలాంటి ప్రయత్నాలు చేయలేదని ఆరోపించారు. అనుమతులు లేవని తెలిసినా రూ.1,000 కోట్ల విలువైన మట్టి పనులు చేపట్టి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, ఇప్పుడు ఆ ప్రాజెక్టును తెలుగుదేశం పార్టీ అడ్డుకుందని తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ను తాగునీటి ప్రాజెక్టుగా ప్రకటిస్తూ జీవో జారీ చేసింది కూడా వైసీపీ ప్రభుత్వమేనని గుర్తుచేశారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని బీద రవిచంద్ర పేర్కొన్నారు. గత రెండేళ్లలోనే రాయలసీమ ఇరిగేషన్ ప్రాజెక్టులపై రూ.12,484 కోట్లు ఖర్చు చేశామని, రానున్న మూడేళ్లలో మరో రూ.10 వేల కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. మొత్తం రూ.35,313 కోట్ల వ్యయంతో 36 సాగునీటి ప్రాజెక్టులను మూడు సంవత్సరాల్లో పూర్తి చేసేందుకు ఇరిగేషన్ క్యాలెండర్ రూపొందించి అమలు చేస్తున్నామని చెప్పారు.వైసీపీ ఐదేళ్ల పాలనలో రాయలసీమ ఇరిగేషన్ ప్రాజెక్టులకు కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే కేటాయించిందని, ఒక్క అదనపు ఎకరాకు కూడా సాగునీరు అందించలేదని విమర్శించారు. హంద్రీ--నీవా సుజల స్రవంతి పథకం సామర్థ్యాన్ని 1,700 నుంచి 3,500 క్యూసెక్కులకు పెంచి చివరి ఆయకట్టుకు నీరు అందించిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిదేనని పేర్కొన్నారు. పులివెందులకు కృష్ణా జలాలను అందించిన చంద్రబాబు పాలనను విమర్శించే నైతిక హక్కు జగన్‌మోహన్ రెడ్డికి లేదన్నారు.పట్టిసీమ ప్రాజెక్టును గతంలో తీవ్రంగా వ్యతిరేకించిన జగన్‌మోహన్ రెడ్డి, అధికారంలోకి వచ్చిన తర్వాత అదే ప్రాజెక్టు ద్వారా నీటిని వినియోగించుకోవాల్సి వచ్చిందని గుర్తు చేశారు. పదేళ్లలో పట్టిసీమ ద్వారా 442 టీఎంసీల నీటిని వినియోగించుకుని రాష్ట్రానికి రూ.44 వేల కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూరిందన్నారు. అలాగే సోమశిల ప్రాజెక్టు గేట్ల మరమ్మతులకు కూడా వైసీపీ ప్రభుత్వం నిధులు కేటాయించలేదని, ఐదేళ్లపాటు నిర్లక్ష్యానికి గురిచేసిందని ఆరోపించారు.రాయలసీమను వెనుకబడిన ప్రాంతం నుంచి పారిశ్రామిక, హార్టికల్చర్, సాగునీటి రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలిచే ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. రాయలసీమలో రూ.4.58 లక్షల కోట్ల పెట్టుబడులు, 2.76 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. యువతకు ఉపాధి కల్పించేందుకు మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో "మిషన్ రాయలసీమ" అమలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే హెచ్ఎన్ఎస్ఎస్, జీఎన్ఎస్ఎస్ వంటి పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయిస్తోందని చెప్పారు.ఈ విలేకరుల సమావేశంలో అబ్దుల్ అజీజ్, డా. జెడ్. శివప్రసాద్, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, రూప్ కుమార్ యాదవ్, చెంచలబాబు యాదవ్, జెన్నీ రమణయ్య, కొండూరు పాలిశెట్టి, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనివాసమంగాపురంలో వైభవంగా ప్రారంభమైన సాక్షాత్కార వైభవోత్సవాలు

**జూలై 20న పార్వేట ఉత్సవం... భక్తులతో కళకళలాడిన ఆలయం**





**చంద్రగిరి, జూలై 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో సాక్షాత్కార వైభవోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. జూలై 20 వరకు కొనసాగే ఈ మహోత్సవాల్లో ప్రతిరోజూ విశేష పూజలు, స్నపన తిరుమంజనం, ఊంజల్ సేవలు, వాహనసేవలు, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.ఉత్సవాల తొలి రోజు తెల్లవారుజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన, అభిషేకం, ఆణివార ఆస్థానం, స్నపన తిరుమంజనం, ఊంజల్ సేవలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి పెద్ద శేష వాహనంపై స్వామివారు ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. గోవింద నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.జూలై 18న హనుమంత వాహనం, జూలై 19న గరుడ వాహనసేవలు సాయంత్రం నిర్వహించనుండగా, ఉత్సవాల ముగింపు సందర్భంగా జూలై 20న శ్రీవారిమెట్టు సమీపంలోని మండపంలో ఉదయం పార్వేట ఉత్సవం, అనంతరం ప్రత్యేక ఆస్థానం వైభవంగా జరగనుంది.సాక్షాత్కార వైభవోత్సవాలకు విశిష్టమైన చారిత్రక ప్రాధాన్యం ఉంది. 14వ శతాబ్దం నుంచి ఈ ఆలయం ఆధ్యాత్మిక వైభవానికి నిలయంగా కొనసాగుతోంది. తాళ్లపాక చిన తిరుమలాచార్యులు ఆలయ పునరుద్ధరణకు విశేష కృషి చేయగా, 1967లో టీటీడీ ఆలయ నిర్వహణను స్వీకరించి నిత్యపూజలు, ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహిస్తోంది. 1981 నుంచి సాక్షాత్కార వైభవోత్సవాలు, నిత్య కల్యాణోత్సవాలు, బ్రహ్మోత్సవాలు నిరంతరంగా నిర్వహిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తోంది.ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ హరికృష్ణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు మునికుమార్, ధనశేఖర్, అర్చకులు, అధికారులు, సిబ్బంది, శ్రీవారి సేవకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ యాదవ్ ప్రముఖులు అశోక్ యాదవ్ మార్కాపురం రాక

**ఘన స్వాగతం పలికిన బీసీ నేత పి.ఎల్.పి. యాదవ్ మిత్ర బృందం**

**మార్కాపురం, జూలై 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** హైదరాబాద్ మహానగరంలోని నార్సింగి మాజీ సర్పంచ్ గ్రేటర్ హైదరాబాద్ యాదవ ప్రముఖుడు అశోక్ యాదవ్ మార్కాపురంలోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పి ఎల్ పి యాదవ్ ఇంటికి వచ్చిన శుభ సందర్భంలో వారిని ఘనంగా సన్మానించిన పి ఎల్ పి యాదవ్. ఈ సందర్భంగా సతీ సమేతంగా తన ఇంటికి వచ్చిన అతిధి అశోక్ యాదవ్ తో ఉన్నటువంటి చిరకాల పరిచయం దృష్ట్యా విందు భోజనాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సన్మాన కార్యక్రమానికి యాదవ యువ న్యాయవాది పిన్నిక నాగార్జున ప్రసాద్ (పి ఎన్ పి)యాదవ్, మార్కాపురం జిల్లా మాదిగ రిజర్వేషన్ పోరాట సంఘం అధ్యక్షులు జోబు దానం, ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మాల సామాజిక వర్గం రాష్ట్ర కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కవలకూరి అబ్రహం రాజ్ కుమార్, వైఎస్ఆర్సిపి మాల సామాజిక విభాగం రాష్ట్ర కమిటీ నాయకులు రమణ లతో పాటు నాగం రామకృష్ణ యాదవ్ వెంకటేష్ యాదవ్ బుర్రి బుల్లెట్ శ్రీనివాస్ యాదవ్ రిటైర్డ్ అసిస్టెంట్ సబ్



ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ యాదవ్, గుర్రం శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కాపు-దళిత బంధానికి వారధి ముద్రగడ-పీవీ సునీల్ కుమార్

**అభ్యుదయ భావాలతో ప్రజల మనసుల్లో చిరస్థానం**

**ముద్రగడకు సమాధి వద్ద ఘన నివాళి**

**ముద్రగడ బాలు,గిరిబాబులను పరామర్శించి ఓదార్చిన పీవీసునీల్ కుమార్, కాపు నాయకులు మారిశెట్టి రాఘవయ్య**





**కిర్లంపూడి,వార్తా ప్రభ జూలై 17**కాకినాడ జిల్లా కిర్లంపూడిలో దివంగత మాజీ మంత్రి,కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం కుటుంబ సభ్యులను మాజీ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్,కాపు ప్రముఖ నాయకులు మారిశెట్టి రాఘవయ్య పరామర్శించారు.ముందుగా ముద్రగడ సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించి,ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా పీవీ సునీల్ కుమార్ మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం ఒక సామాజిక వర్గానికి మాత్రమే పరిమితమైన నాయకుడు కాదని,ఉన్నతమైన అభ్యుదయ భావాలు కలిగిన గొప్ప ప్రజానేత అని పేర్కొన్నారు. కాపులు,దళితుల మధ్య సఖ్యతకు ముద్రగడ కృషి చేశారని అన్నారు.దళితుల పట్ల ముద్రగడకు ఎంతో ప్రేమ, అభిమానం ఉండేదని,రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అంటే ఆయనకు అపారమైన గౌరవమని తెలిపారు.అందుకే కిర్లంపూడిలోని కాపుల రామాలయం సమీపంలో నిలువెత్తు అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయించారని గుర్తు చేశారు.జనరల్ కేటగిరీలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారికి పదవులు కల్పించిన ఘనత ముద్రగడ పద్మనాభంకు దక్కుతుందని పీవీ సునీల్ కుమార్ అన్నారు.దళితులు,కాపులు కలిసి ముందుకు సాగితే కాపు ముఖ్యమంత్రి కావడం సాధ్యమని,ఈ అంశంపై గతంలో ముద్రగడతో చర్చించినట్లు గుర్తు చేశారు.ముద్రగడ తనయులు బాలు,గిరిబాబులను పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.రాజకీయాల్లో విలువలు,ప్రజా సమస్యలపై పోరాటంతో ముద్రగడ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఇండియన్ మిషన్ కాకినాడ జిల్లా కన్వీనర్ గునపర్తి అపురూప్,కాకినాడ జిల్లా మహిళా అధ్యక్షురాలు కొంకిపూడి రాజ్యలక్ష్మి,బీర గాంధీ,కొంగు రమేష్, చిందాడ రమణ,బీరా రామకృష్ణ,బర్రె సింహాచలం,బత్తిన తాతాజీ,ముఖే నానిబాబు, మరియు దళిత నాయకులు తదితరులు పాల్గొని ముద్రగడ పద్మనాభం సమాధి వద్ద నివాళులర్పించారు.

## గంజాయి రహిత సమాజం నిర్మిద్దాం

**ఇబ్రహీంపట్నం సిఐ సుబ్రమణ్యం**



**ఇబ్రహీంపట్నం, జులై 17(వార్తా ప్రభ ప్రతినిధి):**గంజాయి రహిత సమాజం నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వహించాలని పిలుపునిచ్చారు ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్రహ్మణ్యం.పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయలపాడు గ్రామంలో శుక్రవారం ఈగల్ టీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూగంజాయి సేవించడం వల్ల జీవితం నాశనమవుతుందని, ఎంతో భవిష్యత్తు ఉన్న యువత గంజాయి బానిసలుగా మారి జీవితాన్ని కోల్పోతున్నారని తెలిపారు. గంజాయి గురించి ఏదైనా సమాచారం తెలిసిన ఎడల ఈగల్ హెల్ప్ లైన్ నెంబర్ 1972 కి కాల్ చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ ఎస్సై సత్యవతి, ఈగల్ టీం సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి శుక్రవారం డ్రై డే పాటించి దోమల వల్ల కలిగే వ్యాధులను నిర్మూలిద్దాం



**ఇబ్రహీంపట్నం,జులై 17 (వార్తా ప్రభ ప్రతినిధి):** దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులను సమర్థవంతంగా నివారించేందుకు ప్రతి శుక్రవారం డ్రై డేను తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని దాములూరు గ్రామంలో శుక్రవారం డ్రై డే సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు దోమల నివారణపై సూచనలు అందించారు. ప్రధాన కాలువల్లో పూడిక చేపట్టి, చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలను తొలగించి పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేసి దోమల లార్వా పెరగకుండా నివారణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

## 12 ఏళ్లయినా తీరని విమానాశ్రయ నిర్వాసితుల కష్టాలు

**ఆగస్టు 24న కలెక్టరేట్ ముట్టడి: వ్యవసాయ కార్మిక సంఘం హెచ్చరిక**



**గన్నవరం , జూలై 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విమానాశ్రయ విస్తరణ కోసం సర్వస్వం కోల్పోయిన దావాజీగూడెం దళిత కుటుంబాల సమస్యలు పన్నెండేళ్లు గడుస్తున్నా పరిష్కారం కాకపోవడం అత్యంత విచారకరమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం గన్నవరం మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు బాధితుల ప్రాంతాన్ని సందర్శించి, వారి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, 2014లో విమానాశ్రయ విస్తరణ నిమిత్తం దావాజీగూడెం హరిజనవాడకు చెందిన దాదాపు 423 దళిత కుటుంబాలను ప్రభుత్వం ఖాళీ చేయించిందని గుర్తు చేశారు. ఆ సమయంలో పునరావాస (=ఒ=) ప్యాకేజీ కింద ప్రతి కుటుంబానికి 5 సెంట్ల ఇళ్ల స్థలం, కొత్త ఇంటి నిర్మాణానికి నగదుతో పాటు, కుటుంబంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ రూ.9 లక్షల పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.అధికారుల మాటలు నమ్మి ఇళ్లు ఖాళీ చేసిన దళితులకు నేటికీ సరైన న్యాయం జరగలేదని ఆయన విమర్శించారు. గత పన్నెండేళ్లలో రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా నిర్వాసితుల తలరాతలు మారలేదని, దశాబ్ద కాలంగా నిలువనీడ లేక వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.?ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి దావాజీగూడెం విమానాశ్రయ బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితులందరినీ ఐక్యం చేసి, ఆగస్టు 24న జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.?ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, కళ్ళం రాంబాబు, బడుగు మరియదాసు, సూరగాని సాంబశివరావు, ప్రదీప్ మరియు స్థానిక బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవ కార్యక్రమ బ్రోచర్ విడుదల



**గుంటూరు, జూలై 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** స్థానిక తెల్లాకుల జాలయ్య పోలిశెట్టి సోమసుందరం కళాశాల ( స్వయం ప్రతిపత్తి ) కళాశాల జాతీయ సేవా పథకం వారి ఆధ్వర్యంలోఈ నెల 28వ తేదీన ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న "గ్రీన్ కాన్ఫ్లు లెన్స్- 2026" సంబంధించిన బ్రోచెర్ ఆంధ్రప్రదేశ్ ఈగల్ సెల్ ఐజి ఆకె రవి కృష్ణ చేతుల మీదుగా విడుదల చేయడం జరిగిందని కళాశాల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి వి హెచ్ కామేశ్వర శాస్త్రి తెలిపారు. "ఈ గ్రీన్ కాన్ఫ్లూలెన్స్"కార్యక్రమంలో సమస్త ప్రాణికోటికి జీవాధారాలైన నేల, నీరు, ఆకాశం, అగ్ని, వాయువు (ప్రకృతి ) లను ఏవిదంగా పరిరక్షణ చేయాలి,చేయకపోతే జరిగే తీవ్రమైన నష్టాలు గురించి రీసోర్స్ పర్సన్స్ ప్రొఫెసర్ పి బ్రహ్మాజీ రావు( ఎన్విరాన్మెంట్ డిపార్ట్మెంట్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ), కె వి యస్ దుర్గాప్రసాద్ ( రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ డిపార్ట్మెంట్ ఆఫ్ బోటనీ, హిందూ కళాశాల ), ఎం డి నజీనా బేగం, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్, ఆంధ్ర ప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్) వారి ద్వారా అవగాహన కలిగించడం జరుగుతుందని కళాశాల సెక్రటరీ ఒ కరస్పాండెంట్ కె వి బ్రహ్మం పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో కళాశాల విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు, ప్రకృతి ప్రేమికులు పాల్గొనవచ్చు. కార్యక్రమంలో ఎన్విరాన్మెట్ట్ ఎడ్యుకేషన్ నోడల్ అధికారి డి తిరుపతి రెడ్డి, ఐ టి సి ఎం యస్ కె ఫినిష్ సొసైటీ ప్రోగ్రాం మేనేజర్ నారాయణ, జాతీయ సేవా పథకం కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ జెవి సుధీర్ కుమార్,సభ్యులు సిహెచ్ రాంబాబు, జి సురేష్ కుమార్, వై.వి.ఆర్.ఎస్ కుమార్, ఆర్ జయ శైలజ, పి ఎన్ ఎల్ చంద్రిక, ఎన్ యస్ యస్ వాలెంటీర్స్ పాల్గొన్నారు. సామాజిక బాధ్యత గల ప్రకృతి పరిరక్షణ కార్యక్రమానికి, సందీప్ అండ్ శ్వేత రెడ్డి ఫౌండేషన్, ఐ టి సి, బ్యాంక్ ఆఫ్ బరోడా సంస్థలు ఈ కార్యక్రమంలో పాలు పంచుకుంటున్నాయి.